
మహాప్రవక్త "అమ్మ"



ప్రచురణ

మాతృశ్రీ విద్యా పరిషత్

జిల్లెళ్ళమూడి - 522 113

మహాప్రవక్త "అమ్మ"

రచన

ఎ. వి. ఆర్. సుబ్రహ్మణ్యం

ప్రచురణ

మాతృశ్రీ విద్యా పరిషత్

జిల్లెళ్ళమూడి - 522113

గుంటూరు జిల్లా

ప్రధమ ముద్రణ : 30-3-96

మూల్యం : ఇరువది రూపాయలు

ముద్రణ : శ్రీ ఏకా ప్రింటర్సు
పాతగుంటూరు - 522 010.

ప్రతులు దొరుకు స్థానం :

1 మాతృశ్రీ విద్యా పరిషత్, జిల్లెళ్ళమూడి-522 113.
2. శ్రీ విశ్వజననీ పరిషత్, జిల్లెళ్ళమూడి-522 113.

అంఆ

ఈశ్వరానుగ్రహాదేవ పుంసాం అద్వైత వాసనా

'సరియైన కమ్యూనిజం అద్వైతం,' అనీ,
'కూతురుని కోడలిని ఒకటిగా చూడటం అద్వైతం' అనీ
'అంతా అయినదీ అర్థం కానిదీ అద్వైతం' అనీ
అమ్మ వేర్వేరు సందర్భాలలో వివరించింది.
అద్వైతం తత్త్వరీత్యానేగానీ మాటలలోకి వస్తే ద్వైతమే.

ద్వంద్వాలకు ఆధారం తానై, ద్వంద్వాలూ తానైన అమ్మ యొక్క
సర్వసమాన స్థితిని,
సంపూర్ణ తత్త్వాన్ని,
విచక్షణలేని వీక్షణనీ
అభివర్ణించడానికి చేసే చిన్ని ప్రయత్నమే ఈగ్రంథ రచన.

'సర్వం ఖల్విదం బ్రహ్మ' అని మహర్షులు ప్రవచించినా ద్వంద్వాలలో ఒక భాగమైన వెలుతురు, విజ్ఞానం, విజయం, ధనం, ధాన్యం, సంతోషం, సౌభాగ్యం, జీవితం........మాత్రమే ఈశ్వర ప్రసాదంగా భావన చేస్తాం కానీ రెండవ భాగమైన చీకటి, అజ్ఞానం, అపజయం, దారిద్ర్యం, క్లేశం, మరణం........విధిశాపం అనుకోగలం గానీ అదే శక్తి స్వరూపం అని అర్థం చేసుకోలేం; అనుభవంలో జీర్ణం చేసుకోలేము. కారణం —

మన (మానవ) భావం శాస్త్ర జన్య జ్ఞానం,
అమ్మ అను భవం జీవితాధ్యయనసారం. కనుకనే
'పిపీలికాది బ్రహ్మ పర్యంతం' అంటే 'పిపీలిక' (చీమ)
బ్రహ్మ కాకపోతే కదా అనీ,
'ఏందరో మహానుభావులు' అంటే "అందరూ మహానుభావులే అనీ",
"ప్రజ్ఞానం బ్రహ్మ అయితే అజ్ఞానమో" అనీ,
'నువ్వు లక్ష్మీస్వరూపిణివి' అంటే "దారిద్ర్యం కూడు నేనే" అనీ,
"జగన్మాత అంటే జగత్తే 'జగత్తే తల్లి.'
జగత్తూ, జగదీశ్వరీ వేరు కాదు అనీ సంపూర్ణత్వాన్ని దర్శింప చేస్తుంది

"నా దృష్టిలో అంతా చైతన్యమే. జడమేమీ లేదు.
సర్వం సజీవమే.
విశ్వాసమే భగవంతుడు.
శరీరం కూడా ఆత్మకాక పోలేదు.
అనుభవిస్తున్నదే సత్యం.

మానవుని నడకకి ఆధారం నవగ్రహాలు కాదు-రాగద్వేషాలు"వంటి అమ్మ వాక్యాలు ఆధ్యాత్మిక రంగంలో వినూత్నమైన విశిష్టమైన సత్యాలను ఆవిష్కరింప చేస్తాయి.

శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులుగారితో అమ్మ యొక్క విప్లవాత్మక ప్రవచన సత్యాలను ప్రస్తావించి కొన్నిగంటలు వాదించాను, వారు శాస్త్రాలను ఉటంకించి, అంగీకరించలేదు. ఆ విషయాన్ని అమ్మతో ప్రస్తావించగా, "నాన్నా! ఇవన్నీ మాటలే కదా! మాటలు కాకుండా ఉంటే ఎంతైనా ఉన్నది" అన్నది.

అది సంశయచ్ఛేద వచనం కదా!

దీనిని 'యతోవాచో నివర్తన్తే అప్రాప్యమనసా సహ' అని అందామా?

మౌన వ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్త్వం' అని అందామా?

కనుకనే అమ్మ అంటుంది, "అనుభవం లేకపోతే మహావాక్యాలు మన వాక్యాలే" అని.

అట్టి అమ్మ మహావాక్యాలకు నా మనస్సుకు అందినంతవరకు, నేను స్పందించినంతవరకు వివరణ ఇవ్వాలనే దుస్సాహసమే ఈ గ్రంథ రచన.

ఆద్యంతాలు లేని, అంతా తానైన,

'రూపం పరిమితం - శక్తి అనంతం'గా భాసిల్లే మహత్తత్త్వాన్ని మాటల్లో విశదపరచడం ఒక తెప్పను ఆధారంగా చేసుకొని మహాసముద్రాన్ని ఈదాలనుకోవటం వంటిది కాదా! ఈవిషయాన్నే రఘువంశ ప్రారంభంలో మహాకవి కాళిదాసు 'తితీర్షుర్దుస్తరం మోహాత్ ఉడుపేనాస్మిసాగరం' అని అన్నారు.

కావున నా రచనలోని అల్పత్వాన్ని మన్నించి,
అమ్మ అనల్పత్వాన్ని గ్రహించి,
అమ్మ అద్వైతామృత రసార్ణవంలో మునకవేసి,
అనర్ఘ రత్నాలనుపొంది ఆనందించగలరని,
నిఖిల సోదర సోదరీ బృందాన్ని సవినయంగా
వేడుకొంటున్నాను. అమ్మ సంపూర్ణత్వానికి,
సంపూర్ణ తత్త్వానికి ఈ గ్రంథం దర్పణం
పడుతుందని భావిస్తున్నాను.

'ఈశ్వరానుగ్రహాదేవ పుంసాం అద్వైత వాసనా' అని అంటారు; శ్రీ శంకర భగవత్పాదులవారు. అమ్మ అవతారామృతాన్ని అద్వైతసారాన్ని గ్రంథస్థం చేసే మహద్భాగ్యాన్ని నాకు అనుగ్రహించిన అమ్మ అకారణ కారుణ్యానికి, విచక్షణలేని వీక్షణకి వినమ్రుడనై అంజలి ఘటిస్తున్నాను. జగన్మాత పావన పాదపీఠిపై ఈ అక్షరాకృతి కృత కృతజ్ఞతా కుసుమాంజలిని సమర్పిస్తున్నాను.

'నిజానికి ఈ పుస్తకం వినూతనమైనదికాదు అమ్మ అవతారకాలంలో 'మహాప్రవక్త అమ్మ అనే శీర్షికతో మాతృశ్రీ మాస పత్రికలలో ధారావాహికంగా ప్రచురింపబడిన వ్యాసముల సంపుటి మాత్రమే.

— రచయిత.

—)o(—

అందువల్లనే 'అమ్మ' సర్వజ్ఞగా, సద్గురువుగా విజ్ఞాన ప్రపంచ సామ్రాజ్ఞిగా సుప్రసిద్ధ అయింది.

అమ్మ వక్తకాదు. ఎక్కడా, ఎప్పుడూ ఏ వేదికలనుండి ఏ విధమైన ప్రసంగాలూ చేయలేదు.

వాంఛితార్ధ ప్రదాయినిగా, భక్త సౌభాగ్యదాయినిగా, మోక్షదాత్రిగా- 'అమ్మ' సుప్రసిద్ధ అయినందువల్ల, నిత్యము ఎందరో ఆర్తులు, ఆర్థార్థులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు అమ్మను దర్శించు కొనేందుకు, అర్చించు కొనేందుకు వేలాదిగా వచ్చేవారు.

వాళ్ళు అనేక విధాల అమ్మను ప్రశ్నిస్తుండేవారు. లౌకికమూ, ఆధ్యాత్మకమూ అయినా వాళ్ళ సమస్యలను, అమ్మ సన్నిధికి నివేదించేవాళ్ళు, సంసారంలోగానీ, సాధనలోగానీ వాళ్ళకు అడ్డు వచ్చిన సందేహాలను 'అమ్మ. ముందుంచేవాళ్ళు. అందరి వేదనలనూ, నివేద- నలనూ ఓర్పుగా విని- అందరికి సంతృప్తికరంగా- ప్రశ్నలకు సమాధానాలనూ, సమస్యలకు పరిష్కారాలనూ, సందేహాలకు నివృత్తులనూ, కష్టాలకు విముక్తులను- ప్రసాదించేది 'అమ్మ'.

అట్లా అమ్మ అప్పుడప్పుడు సంభాషణల్లో చెప్పిన సూక్తులే - నేడు తత్త్వ గగనతలంలో తారకలై మనకు ఎంతో వెలుగును ప్రసరిస్తున్నాయి.

అట్లా అమ్మ నుండి వెలువడ్డ వాక్యాల్లో కొన్ని - లోగడ పెద్దలూ' శాస్త్రాలూ చెప్పిన విషయాలతో సరిపోవచ్చు. కొన్ని అంతకంటే భిన్నంగా, అంతకంటే నిండుగా, అంతకంటే మెరుగ్గా అంతకంటే బరువుగా ఉండవచ్చు. అవి సరి తూగినా, ఒక అడుగు ముందుకు వేసినా అన్నీ - అమ్మ అనుభవ సంజనితాలే. అందుకనే అవి సర్వోత్కృష్టమై, సముజ్వలమై భాసిస్తుంటాయి.

"అంతా అదే"

"కనిపించేదీ, కనిపించనిదీ - అంతాదైవమే"

"ఎంత వెదికినా నాకు అది కానిది కనిపించటం లేదు"- అని తాను పొందిన దర్శనాన్ని ఉద్ఘాటించినా-

"నేను నేనైన నేను"

"అన్ని నేనులూ నేనే" "మీరంతా నేనే, మీదందా నేనే, ఇదంతా నేనే"- అని ఎన్ని విధాలుగా తనకు లోకంతో కలతాదాత్మ్య వైభవాన్ని ప్రకటించినా-

ఈ రెండు స్థితులూ పూర్వ ఋషులకూ, పూర్వసాధకులకూ సిద్ధి రూపమైన అనుభవాలే.

అమ్మ ఈ రెండు స్థితులను అనుభవిస్తూ, ప్రకటిస్తూనే-

మరో అపూర్వమైన స్థితిని అనుభవించి, మనోహరమైన తన ప్రత్యేక శైలిలో సర్వ జన హృదయంగమంగా ప్రవచించి - లోకాన్ని వాత్సల్య క్షీర జలధిలో నిలువునా ముంచెత్తి, ఆనంద పరవశం చేసింది.

"నేను అమ్మను - మీరు బిడ్డలు"

"ఎవర్ని చూసినా, నాకు నాబిడ్డే అనిపిస్తుంది."

"నేనే మిమ్ముల్నందరినీ కని, మీమీ తల్లులకు పెంపుడిచ్చాను."- అన్న మధుర మధుర మమతాపూర్ణ మహిత వాక్యాలు ఆధ్యాత్మిక సారస్వత చరిత్రలోనే అపూర్వాలు. ప్రపంచ సాహిత్య వల్లరి తొడిగిన కొల్విరులు గుబాళింపులు అవి. లోగడ ఆధ్యాత్మిక వేత్తలు లోకాన్ని సగం సత్తుగానూ, సగం అసత్తుగానూ విభజించారు.

"ప్రజ్ఞానం బ్రహ్మ అయితే - అజ్ఞానమూ బ్రహ్మే."

"అన్నం పరబ్రహ్మమైతే అశుద్ధమూ అంతే."

"శబ్దం బ్రహ్మయితే నిశ్శబ్దమూ బ్రహ్మే."

"ఆనందం బ్రహ్మమయితే దుఃఖమూ బ్రహ్మయే."

"గంగా నదే కాదు - మురుగు కాలువకూడా దైవమే." - అని ఒక సంపూర్ణతా వాదాన్ని, సరికొత్త నినాదాన్ని ఎలుగెత్తి చాటింది అమ్మ.

లోగడ శాస్త్రిలు జడమనీ - చేతనమనీ, సజీవమనీ - నిర్జీవమనీ లోకాన్ని రెండుగా నిలువునా చీలిస్తే -

"నా దృష్టిలో అంతా సజీవమే."

"నా దృష్టిలో జడమ నేదే అంతా చైతన్యమే."

"శరీరం ఆత్మ కాక పోలేదు."

"ఎందరో మహానుభావులు కాదు, అందరూ మహానుభావులే."- అన్న ప్రసిద్ధ ప్రకటనలతో నాణెమునకు రెండవ వైపు కూడా చూపి మానవ మస్తిష్కంలో సంచలనాన్ని సృజించింది అమ్మ.

ఎక్కడో మిణుకు మిణుకు మనే దీపంలాగా - "సర్వం ఖల్విదం బ్రహ్మ" - అన్న మంత్రాన్ని ధర్శించి నప్పటికీ - పూర్వ ఋషుల తత్త్వాధ్యయనంలో -

దైవం "సర్వాంతర్యామి" గానే మిగిలిపోయాడు.

ఆ వాదాన్ని అమ్మ తిరస్కరించి - దైవం సర్వరూపుడని వక్కాణించడం పండితుల దృష్టిని కూడా ఆకర్షించింది.

నిరాకారుడంటే - "అన్ని ఆకారములు కలవాడు."

నిర్గుణుడంటే - "అన్ని గుణాలు కలవాడు" - అన్న వాక్యాలు ఆకడలి కెరటాలే.

'చీమలో,' 'దోమలో' ఉన్న దైవాన్ని మాత్రమే త్యాగరాయ ప్రభృతులు ప్రస్తుతిస్తుంటే, 'చీమగా,' 'దోమగా' అని అమ్మ సరిచేయటం గమనార్హం.

భగవంతుణ్ని 'తాపసమందార' అని పోతనాదులు సంబోధిస్తే -

భగవంతుడు 'తామసమందారుడు' కూడా అని సరిదిద్దింది అమ్మ.

ఎన్నో అపూర్వ సత్యాలను అత్యంత మనోజ్ఞంగా, ప్రతిభావంతంగా వివరించి ఆధ్యాత్మిక సీమలో కొత్త పుంతలు వేసింది అమ్మ.

సాధకులకు మార్గదర్శిని అయి చేయి పట్టి నడిపించటమే కాక - వారిని ఒడిలో కూర్చొబెట్టుకుని, అమ్మ - కైవల్య పద సింహాసనాసీన అయింది. అమ్మది మార్జాలకిశోర న్యాయం.

"నాకు భక్తులెవరూ లేరు అంతా బిడ్డలే."

"నాకు శిష్యులెవరూ లేరు అంతా శిశువులే."

"నేను గురువునుకాను మీరు శిష్యులు కారు",

నేను మార్గదర్శికాను మీరు బాటసారులు కారు,

"నేను అమ్మను మీరు బిడ్డలు". ఈ వాక్యాలు అమ్మ అద్భుత చరిత్రలో అమృతాక్షరాలు, ఈ వాక్యాల్లో ఉన్న అతిలోక భావాలు మరెక్కడా కనిపించని కోహినూరులు.

సాధకుల చరిత్రలు చదివితే అందరికి సిద్ధి లభించినట్లు, భక్తుల కథలు వింటే అందరికీ మోక్షం ప్రాప్తించినట్లు మనకు గోచరించదు.

"అందరికీ సుగతే" అని ఘంటాపథంగా చెప్పింది అమ్మ మాత్రమే.

మనం చేసుకున్న పాప పుణ్యాలనూ, మన అర్హతలనూ అనుసరించి, భగవంతుడు మనకు ఫలితాన్ని ప్రసాదిస్తాడు. అని మన పురాణ ప్రపంచం ఉద్ఘోషిస్తుంటే-

"పుణ్యపాపాలనేవే లేవు." అవి ఏవైనా వుంటే భగవంతుడికే." అని చెబుతూ -

"మనిషికి కర్తృత్వమే లేదు" అని విశదీకరిస్తూ "తోచిందేదో చెయ్యి తోపింపచేసేది వాడేగా."- అని సుస్పష్టంగా, నిర్ద్వంద్వంగా ఉద్ఘాటించి - సాలెగూడిలో చిక్కుకున్న మనిషికి విముక్తిని ప్రసాదించిన 'అమ్మ కారుణ్యం' లోకాతీతమూ అమేయమూ.

వేదాంత లోకమంతా పునర్జన్మను గురించి అనేకమైన కథలనూ, గాథలనూ వినిపిస్తుంటే, మనిషికి పునర్జన్మ అనేదీ ఊహాజనితం-అని చెబుతూ కడలి కెరటాలను ఉదాహరణగా చూపించి పండితులను నిరుత్తరులను చేయటం-అమ్మ లోకోత్తర మేధో విభవానికి నిదర్శనం.

భూత కాలమనీ, భవిష్యత్కాలమనీ - ఇన్ని నాకు లేవు. నాకు అంతా వర్తమానమే· అని ప్రవచించిన అమ్మ-అది మధ్యాంతరహిత, కాలాతీత.

అమ్మ వాక్యాలు సార్వ కాలికాలు, సార్వ జనీనాలు.

ఆధ్యాత్మిక రంగంలో ప్రప్రథమంగా సంపూర్ణ తత్వాన్ని సందర్శించి సామ్యవాదాన్ని ప్రవేశపెట్టి - అనర్ఘ రత్నాలను వెదజల్లిన అమ్మ క్రాంత దర్శిని, తత్త్వవేదిని, సద్గురువూ, మహాప్రవక్త.

అమ్మ దగ్గరకు వచ్చేవారందరూ జిజ్ఞాసువులు కారు. అల్ప సంఖ్యాకులకు మాత్రమే జిజ్ఞాస ఉంటుంది. ఆకొద్ది మందిలో ఈ గ్రంథ రచయిత శ్రీ ఏ. వి. ఆర్. సుబ్రహ్మణ్యం ఒకరు. అమ్మ - నాన్నగార్ల పూర్ణ ప్రేమను పొందిన అదృష్టవంతుడు శ్రీ సుబ్రహ్మణ్యం.

ఆ ప్రేమ వల్ల అమ్మతో సాన్నిహిత్యం సంపాదించి దానిని సార్థకం చేసుకున్న సుబ్రహ్మణ్యం, అమ్మతో ఎన్నో సంభాషణలు చేసి, అమ్మ నుండి ఎంతో పరిజ్ఞానాన్ని మూటగట్టుకున్న అధ్యయనశీలి, ప్రతిభాశాలి శ్రీ సుబ్రహ్మణ్యం.

అమ్మ చెప్పిన కొత్త పాఠాలను, కొత్తశాస్త్రాన్ని స్వయంగా ఆలించి అధ్యయనం చేసి, అవగాహన చేసుకొని, ప్రభావితుడై పులకితాంగుడైన నిర్మల చిత్తుడు, అమ్మ తత్త్వ మధుపాన మత్తుడు శ్రీ సుబ్రహ్మణ్యం.

అ ఆనంద సంపదను తనలోనే దాచుకొనక - అమ్మ వాక్యాల్లో కొన్నింటికి వివరణలనిచ్చి లోకానికి అమ్మ అపూర్వ తత్త్వాన్ని సుబోధం చేయాలనే రచయిత మంచి తలంపుకు ఫలితమే ఈ ఉత్తమ గ్రంథం.

ఈ గ్రంథం అమ్మ వాక్యాలకు వివరణ మాత్రమేకాక - అమ్మ వాక్యాల పట్ల శ్రీ సుబ్రహ్మణ్యం స్పందించిన తీరుకు అతని ఆధ్యాత్మిక దృష్టికీ దర్పణం పడుతున్నది.

ఈ వాక్యాలు కాక, ఇంకా వేల సంఖ్యలో అమ్మ సూక్తులు ఉన్నాయి. క్రమశః వాటన్నిటికీ శ్రీసుబ్రహ్మణ్యం వ్యాఖ్యానం సంతరిస్తే - అది జిజ్ఞాసు లోకానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

అమ్మ వాక్యాలు ఎంతో సరళంగా ఉన్నట్లు మనకు భ్రమను కలిగిస్తాయి. ఎన్నో వాక్యాలకు వివరణలు ఉంటేగానీ మనకు అర్థం కాని మాట - నిజం.

ఇంకా ఇటువంటి ఉత్తమ గ్రంథాలను శ్రీ సుబ్రహ్మణ్యం లోకానికి అందించాలని సర్వేశ్వరి అయిన అమ్మను ప్రార్థిస్తున్నాను.

రెండు చేతుల కలయికతో నమస్కారమయినట్లు ఒక చెయ్యి అయిన శ్రీ సుబ్రహ్మణ్యానికి - ఉదారులూ, ఉత్తమ సంస్కారులూ, భిషగ్వర్యులు అయిన డా॥ ఆచంట కేశవరావుగారు అమ్మ వరప్రసాదంగా లభ్యమై, రెండవ చేయి అయి అమ్మకు సమస్కారం కాగలగడం పూర్వపుణ్య విశేషం లౌకిక పారలౌకికమైన అన్ని కార్యక్రమాల్లో డాక్టరు గారికి చేదోడు వాదోడుగా నిలిచిన వారి సతీమణి శ్రీమతి అన్నపూర్ణక్కయ్య అమ్మకు ప్రియ పుత్రిక.

1973 నవంబరులో అమ్మ చేసిన వాత్సల్యయాత్రలో భాగంగా అమ్మ డాక్టరుగారి నివాస, వైద్యాలయ ప్రాంగణాలను తన పావన పాద ధూళితో పరిపూతం చేసిన సుసంఘటన నేనెన్నడూ మరువలేను.

జిల్లెళ్ళమూడి
ధాత ఉగాది

కొండముది రామకృష్ణ
20-3-1996.

—)○(—

మహాప్రవక్త "అమ్మ"



—: సమర్పణ :—

డాక్టర్ : ఆచంట కేశవరావు,

" అన్నపూర్ణ

అంతా

మహాప్రవక్త అమ్మ

"దిశతి హి నవసందేశం

జిజ్ఞాసు జనాయ" – జిజ్ఞాసువులకు అమ్మ వినూత్న సందేశాన్ని అందిస్తున్నదని అంటారు డా॥ పన్నాల రాధాకృష్ణశర్మ అన్నయ్యగారు.

"ఆధ్యాత్మిక చింతనలో సామ్యవాదాన్ని ప్రప్రథమంగా ప్రవేశపెట్టిన మహాప్రవక్త అమ్మ" అని వివరిస్తాడు రామకృష్ణ అన్నయ్య.

"జన్మలు లేవని

జగత్తు సత్యమని

శరీరము ఆత్మకాకపోలేదని

స్వభావమే దైవమని

అంతా చైతన్యమే, జడమేమీ లేదని

ప్రజ్ఞానం బ్రహ్మయితే అజ్ఞానమూ బ్రహ్మే నని

అన్నం బ్రహ్మయితే అశుద్ధమూ బ్రహ్మే నని"

అమ్మ వినూత్న విప్లవాత్మక సత్యాలను ఎన్నో ప్రవచిస్తోంది.

అమ్మ దృష్టిలో పాపులు, పుణ్యులు అని వేరే లేదు.

ఆశ్రయించినవారినీ, ఆశ్రయించనివారనీ తేడా లేదు.

అమ్మ మనస్తత్వంలో భిన్నత్వం లేదు.

అమ్మ విధానంలో ఆశ్రిత పక్షపాతం లేదు.

తల్లికి తప్పే కనిపించదట. కనుకనే "అందరికి సుగతే"నని బాహాటంగా బేరషతుగా ప్రకటించింది.

"భిన్నత్వం లేని మనస్తత్వం,
విచక్షణ లేని వీక్షణ,
సర్వసమాన దృష్టి"

ఈ అధునాతన సిద్ధాంతాన్నే ఆధ్యాత్మిక చింతనలో సామ్యవాదంగా తార్కికులు పేర్కొంటున్నారని రామకృష్ణ అన్నయ్య విశదీకరిస్తాడు. నా అల్పమైన తెలివితో ఈ అనల్పమైన సత్యాలను మరింత వివరించాలనే సాహసమే ఈ వ్యాసరచనకు ప్రేరణ.

1. "నా దృష్టిలో అంతా చైతన్యమే, జడమేమీ లేదు" :

సైన్సు దృష్ట్యా సజీవపదార్థాలు, నిర్జీవపదార్థాలు అని ఉన్నాయి కాని జడపదార్థం అన్నది లేదు. పదార్థమంతా సూక్ష్మాతిసూక్ష్మమైన అణువులతో నిర్మితమై ఉంది. అణువు కేంద్రమువద్ద న్యూక్లియస్; అందులో పూరితము లేని న్యూట్రానులు, ధనపూరితములైన ప్రోటానులు ఉన్నాయి. న్యూక్లియస్ చుట్టూ నిర్ణీత కక్ష్యలలో అతివేగంగా ఋణపూరితమైన ఎలక్ట్రానులు పరిభ్రమిస్తున్నాయి. ఇట్టి అణువు చైతన్య విహీనమా? అణువులతో నిర్మితమైన పదార్థము చైతన్య విహీనమా ? "పదార్థాన్ని సృష్టించలేము, నాశనం చెయ్యలేము" - అని తెలుసు. యురేనియం 235 పదార్థం 0.2 గ్రా॥లు నాశనం చెందితే $0.2\,(3\times10^{10})^2$ ergs seven Million Horse Power Hour అంతశక్తి విడుదల అవుతుంది. పదార్థం నశించినప్పుడు గొప్పశక్తి వెలువడుతోంది. అంటే శక్తి పదార్థరూపేణా ఉన్నది అన్న సత్యం సులభంగా అర్థమవుతోంది. కనుకనే అమ్మ, "జగన్మాత అంటే ఎక్కడో లేదు.

ఈ జగత్తే తల్లి,

ఈ సృష్టే .... కనిపించే ఈ కొండలు, నదులు, కాయలు, పండ్లు, గుళ్ళు, గుడిసెలు, గోపురాలు....సర్వమూ అదే" - అని అంటుంది. తన సంపూర్ణ తత్వాన్ని విపులీకరిస్తూ–"సృష్టి అంటే పారిజాతపుష్పాలు, సుగంధ పరిమళాలు, మలయపవనం, సెలయేళ్ళు, పచ్చికబీళ్ళు, తరులు, గిరులు మాత్రమే కాదు, చీకటి, చీము, నెత్తురు, దుర్గంధము, దారిద్ర్యము, అగ్ని పర్వతాలు, పుష్కలావర్తకమేఘాలు, ప్రళయకారక ఝంఝూమారుతాలు.... సౌందర్యం, వికారం, సర్వమూను-" అంటుంది.

2. "నీకూ, మీకూ, అందరికి, పశుపక్ష్యాదులకూ, క్రిమి కీటకాదులకూ...సర్వానికి తల్లిని"

అని అమ్మ తన సర్వమాతృత్వాన్ని ప్రకటించింది. మానవాళి జీవకోటిలో ఒకభాగం మాత్రమే. జీవరాశి అంతా మనుగడకోసం నిర్జీవ పదార్థములపై ఆధారపడి యున్నది. మనం త్రాగే నీరు, పీల్చే గాలి, తినే ఆహారమూ సర్వమూ నిర్జీవపదార్థములే. మొక్కలు, సూక్ష్మజీవులు, జంతువులు, మానవులు (క్షీరదాలనే జంతువులు) పరస్పరాశ్రయంతో మనుగడ సాగిస్తున్నాయి. జీవరాశిలో మొక్కలు మాత్రమే స్వయంపోషకాలు. జంతువులు పరపోషకాలు, మొక్కల ఆహారం కేవలం నీరు అని నిరూపించబడింది.

సృష్టిస్థితికి కారణాలను వెతుక్కుంటే నిర్జీవపదార్థాలే కాదు, కంటికి అగుపించని సూక్ష్మజీవులనుంచి అన్నీ ప్రముఖపాత్రలు వహిస్తాయి.

కనుకనే అమ్మ మానవులవరకే తన మాతృత్వాన్ని పరిమితంచేసి ఉంటే అది అసంపూర్ణమూ అసమగ్రమైన ప్రకటన అయి ఉండేది.

"గడ్డకూడా బిడ్డేనంటూ,

రోగాలకు తల్లినే"నని ప్రకటించింది. మరి రోగాలంటే అపకారులైన సూక్ష్మజీవులు కదా! రోగాలు మనవద్దకు వస్తే మందులువేసి తరిమేస్తాము. వాటికి కూడా ఆశ్రయాన్నిచ్చి అమ్మ భరిస్తున్నది. మరి –

"సర్వరోగ సంవర్ధని

సర్వరోగ సంధారిణి

సర్వరోగ సంహారిణి" – తనేకదా ! కనుకనే అమ్మ ప్రేమతత్వం, అనురాగ సిద్ధాంతం కూడా విప్లవాత్మకమైనవే నని అంటాను.

3. అన్నం బ్రహ్మైతే అశుద్ధం బ్రహ్మ ఎందుకు కాదు ?

"శబ్దము బ్రహ్మైతే సైలెన్సూ బ్రహ్మే

ప్రజ్ఞానం బ్రహ్మైతే అజ్ఞానమూ బ్రహ్మే

అన్నం బ్రహ్మైతే అశుద్ధమూ బ్రహ్మే"

— అని అమ్మ దండకం మాదిరి ధారావాహికంగా వివరిస్తుంటే అవ్యక్త మధురంగా ఉన్నాయనుకుంటున్నాం కానీ ఆపాత మధురంగా ఉన్నాయని అవగాహన చేసుకోలేక పోతున్నాము. పూర్వ సిద్ధాంతాలకంటె విలక్షణం గాను, విశిష్టంగాను, ఉన్నాయని గుర్తించలేక పోతున్నాము.

మన పెద్దలంతా కలిసి, "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని ఒక్కమాటతో చెప్పారు. వారంతా ఒకవైపే చెప్పారనిపిస్తుంది నాకు. సర్వం తానైన అమ్మకు అన్ని సిద్ధాంతాలూ ఒకటిగానే కనిపిస్తాయి. అన్ని సిద్ధాంతాల్ని ఒకటిగా కనగలిగే అమ్మ సిద్ధాంతమే నాకు పరిపూర్ణంగా గోచరిస్తుంది. మన కోసం, మనమధ్య జిల్లెళ్ళమూడిలో అమ్మ చిన్న మంచంమీద కూర్చుని అన్నపూర్ణేశ్వరిలా కడుపునింపి అకలిని; జ్ఞానప్రసూనాంబలా జ్ఞానభిక్ష పెట్టి అజ్ఞానాన్ని పరిహరిస్తోంది.

అన్నం మనిషికి పరబ్రహ్మ స్వరూపమైతే, జీవనాధారమైతే, - అన్నం పరిణామమైన అశుద్ధం మరొక జీవరాశికి అన్నం అవుతోంది, జీవనాధార మౌతోంది. కావున దానికి బ్రహ్మేననే మాట ఎట్లా ఉన్నా - జంతువుల మలమేకాదు, మూత్రము, మృతకళేబరాలు కూడా సూక్ష్మజీవుల చర్యవలన అమ్మోనియా లవణాలుగా మార్చబడుతున్నాయి. ఈ స్వాభావిక ఎరువులు

మొక్కలకెంతో ఉపయోగకరములనేది మన స్వానుభవం కూడా. ఇది ప్రకృతిలో సహజంగా ఉన్న నిర్విరామ ప్రక్రియ. దీనికి Section Superintendents Steno లు, U.D.C. లు అక్కరలేదు. ఇది లీలానాటక సూత్రధారి పాట్లు; ఏర్పాటూను. కనుకనే అమ్మ 'waste' అనే పదాన్ని అంగీకరించదు. అమ్మ దృష్టిలో అన్నీ అర్థవంతములే; ఏదీ వ్యర్థము కాదు.

4 సర్వ సమ్మతమే నా మతం :

రామకృష్ణ అన్నయ్య : అమ్మా! మంత్రం అనేది ప్రతివ్యక్తికీ అవసరమేనా?

అమ్మ : నా దృష్టిలో అవసరమూ కాదు; అనవసరమూ కాదు.

రా. అ : మరి ఉపనయనంలో వటువులకి మంత్రోపదేశం చేస్తున్నావుగా ?

అమ్మ : వాళ్ళు చెయ్యమంటున్నారు, చేస్తున్నాను.

రా. అ : అందరికీ మంత్రం అవసరమేనా ? ఒక స్త్రీ అడిగితే మంత్రోపదేశం చేస్తావా ?

అమ్మ : అక్షరాభ్యాసం మంత్రం కాదా? వివాహం మంత్రం కాదా?

రా. అ : అది కాదమ్మా, అసలు మంత్రం అవసరమా ? కాదా ? నిర్దిష్టమైన నీ అభిప్రాయం చెప్పు.

అమ్మ : అవసరమూ కాదు. అనవసరమూ కాదు.
(గారెముక్కల్ని చిదిపి అందరికీ అమ్మ ప్రసాదం ఇచ్చింది.)

రా. అ : ఈ ముక్కలతో సరిపెడతావు! అసలుముక్క చెప్పవు.

అమ్మ : (నవ్వుతూ) ఇదే అసలు ముక్క.

దేశానికి I A.S. Officer అవసరమా ? L.D.C. అవసరమా ? Major General అవసరమా ? Soldier అవసరమా? Commissioner అవసరమా? Scavanger అవసరమా ? Peon అవసరమా, అనవసరమా? Bill Collector అవసరమా అనవసరమా ? అందరూ అవసరమే. ఎవరి పని వారిదే. ఎవరి పరిధి వారిదే. సాధన దగ్గరికి వచ్చేటప్పటికి అనేక మార్గాలు ఉన్నాయి.

భక్తిమార్గం .... ఇందులో మరలా 9 రకాలు. జ్ఞానమార్గం, వైరాగ్యం, యోగాభ్యాసం .... యెన్నో. ఏ మార్గం అవసరం? యేది అనవసరం? అంటే ఒక్కొక్కరికి ఒక్కొక్కమార్గం అవసరం. వానికి మిగిలిన దారులు అనవసరం యే వ్యక్తీ ఏకకాలంలో అనేక మార్గాలలో పోలేడు. అయినా అమ్మ స్వధర్మానుష్టానానికే ప్రాధాన్యం యిస్తుంది. ప్రాపంచికము, పారమార్థికమూ అనే విభజన అమ్మదృష్టిలో లేదు కదా! ఈ లోకాన్నే లోకేశునిగ దర్శించమంటుంది. "నీ విద్యార్థులే నీకు అన్నం పెడుతున్నారని పాఠం చెప్పు" అనీ, "నీ పిల్లలే ఈశ్వరస్వరూపులని సేవ చెయ్యి" అని "వైద్యునికి రోగికూడా నారాయణ స్వరూపుడే" అనీ, "గురుర్బ్రహ్మ అన్న తర్వాత ఏ గురువుకి మహిమ ఎక్కువ - యే మంత్రానికి శక్తి యెక్కువ అన్న ప్రశ్నలే"దనీ, "ఆచరించేవాడికి ఏదయినా ఒకటే"ననీ, "భర్తకు భార్య దేవత. భార్యకు భర్త దేవుడు" అనీ, "అంతా|ఒకే తల్లిపిల్లలు అనే భావం కలిగియుండ"మనీ....

"సర్వత్రా మమకారం మాధవత్వాన్ని తెలియచేస్తుంద"ని చెపుతుంది. Church Prayer చెయ్యటం మంచిదా? శివాలయంలో రుద్రాభిషేకం చెయ్యటం మంచిదా ? మసీదులో నమాజు చెయ్యటం మంచిదా? అంటే ఏం చెపుతాం? ఏది నమ్మినవాడికి అది మంచిది.

ఆదిత్యులు, శాక్తేయులు, వైష్ణవులు, గాణాపత్యులు, శైవులు సూర్యుడ్నీ, శక్తిని, విష్ణువుని, వినాయకుడ్ని, శివుని తమ తమ ఆరాధ్యమూర్తులుగా యేర్పరచుకొని మేము గొప్ప అంటే మేము గొప్ప అనే తరుణంలో "రూపాలలో తేడా కాని పరమేశ్వరుడు ఒకడే"నని స్ఫూర్తిని కలిగి భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించమని, ఈర్ష్యాసూయాలను విడనాడమనీ, పరమత సహనం కలిగియుండమనీ పరోక్షంగా ప్రవచిస్తూ శ్రీ శంకరులు పంచాయతన పూజా ప్రక్రియను ప్రవేశపెట్టారు. కొందరు శివపంచాయతనం అనీ, కొందరు విష్ణుపంచాయతనం అనీ, శివుని కేంద్రంగా, విష్ణుని కేంద్రంగా ఉంచుకుని, తమ ఇష్టదైవం చుట్టూ మిగిలిన 4 రూపాల్ని సుప్రతిష్ఠతంచేసి అర్చిస్తారు. ఆయతనం అంటే ఇల్లుఅనీ, గుడిఅనీ అర్థం. ఈ ఐదు రూపాలతోపాటు అరవదైవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించుమని కంచి

కామకోటి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు చెప్పారు. రూపాలు ఎన్నైనా పరతత్వం ఒక్కటే అనేదే మూల సిద్ధాంతం.

అట్లే మార్గాలు యెన్నయినా గమ్యం ఒక్కటే. అందరికీ ఒకేసాధన.... నామమో, మంత్రమో, పారాయణో, జపమో, యోగాభ్యాసమో .... అవశ్యం ఆచరణీయమని అమ్మ యెట్లా నిర్దేశిస్తుంది ?

"అందరికీ మంత్రం అవసరము కాదు" అని అమ్మ అనటంలో మంత్రం నిరుపయోగం అనేది కాదు అమ్మ ఉద్దేశం. సాధ్యమైనదే కదా సాధన. మంత్రం అనుష్ఠించకలిగిన వారికీ అది ఉపయోగం, లేనివారికి నిరుపయోగం. అక్షరాభ్యాసం సందర్భంగా చేసిన పంచాక్షరీ మంత్రాన్నీ ఉపనయనం సందర్భంగా చేసిన గాయత్రీ మంత్రాన్ని, మనలో ఎందరు అనుష్ఠిస్తున్నారు.

"సాధన ఒకరు చేయమన్నదీ కాదు, నువ్వు చేద్దామనుకున్నదీ కాదు. ఆ శక్తి నీచేత చేయించినదే సాధన-" అని అమ్మ అంటుంది. "ఈ సృష్టిలో నీ సేవలు, నీ శక్తి యెవరికి చెందినా అవి దైవానికి చెందినట్లే" అని అమ్మ హామీనిస్తుంది. సర్వుల్నీ ప్రేమిస్తూ, సర్వమతాల్ని, సర్వ అభిమతాల్ని ఆదరిస్తూ అన్నిటికీ సమానమయిన విలువను సంతరించే మహాప్రవక్త అమ్మ. కనుకనే "సర్వ సమ్మతమే నా మతం" అని అమ్మ నిస్పష్టంగా ప్రకటించింది. ఇదే ఈ అవతారం యొక్క విశేషమూ, విశిష్టమూ అయిన లక్ష్యం, లక్షణం.

5. శరీరం ఆత్మ కాకపోలేదు :

మానవుడు చినిగిన వస్త్రాన్ని విడిచి కొత్తవస్త్రం ధరించినట్లు జీవుడు ఒక శరీరాన్ని విడిచి మరొక శరీరాన్ని ధరిస్తున్నట్లు చెప్పారు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని కూడా చెప్పారు. ఐతే విశీర్ణమైన వస్త్రం, విసర్జించ బడిన శరీరమూ వారు చెప్పిన "సర్వం"లోకి రావా ? స్వయం ప్రకాశమాన మైన, అవ్యయమైన ఆత్మశక్తి ఈ సృష్టిలో సజీవులలోనే ఉన్నదా? నిర్జీవులలో లేదా? లేనప్పుడు అవి ఆత్మశక్తి పరిధిలోకి రాని స్వతంత్ర ప్రతిపత్తి గల వేరొక పదార్థాలు కాని, అన్యశక్తి సంజనితాలు కాని అవుతాయా?

ఈ జగత్తు అంతయూ ఆత్మయే. కావున ఇచట దేహాదుల కల్పన ఎచట ? (ఆత్మైవేదం జగత్సర్వం కుతో దేహాది కల్పనా) అని శ్రీ వసిష్ఠగీత ప్రశ్నిస్తుంది. దేహాదుల కల్పనయే అనావశ్యకం అని తెలియపరుస్తుంది. అమ్మ మాటలలో మరింత స్పష్టంగా సంపూర్ణంగా చెప్పాలంటే, "ఈ సృష్టే దేవుడు.

దేవుడు ఈ సృష్టిని చేయటం కాదు.

ఈ కనిపించే చెట్లు, కొండలు, పూలు, పరిమళాలు, సౌందర్యం వికారం .... సర్వమూ అదే.

యెంత వెదికినా అదికానిది నాకు కనిపించటం లేదు"—అని.

ఒకసారి సృష్టికి, సృష్టికర్తకి అభేదత్వాన్ని చెపుతారు; మరొకసారి రెండింటికీ మధ్య ఒక అడ్డుగోడని నిర్మిస్తారు. కాని అమ్మ, "శరీరం ఆత్మ కాకపోలేదు" అని నిర్ద్వంద్వంగా చేసిన ప్రకటన ఆధ్యాత్మిక రంగంలో తీవ్ర సంచలనాన్ని కలిగించింది, ఆలోచనా సముద్రంలో ముంచివేసింది.

"నైనం ఛిందన్తి శస్త్రాణి, నైనం దహతి పావకః"....ఆత్మను తడుపుటకు గాని, ముక్కలుగా ఛేదించుటకు కాని, దహించుటకు కాని, శక్యముకాదు అని చెప్పబడింది. శరీరం ఆత్మ అయినప్పుడు ఈ లక్షణాలు దానికి కూడా ఉన్నాయా-అనే అంశం పరిశీలిద్దాం.

ఏ వస్తువునయినా నిప్పు, నీరు ఏంచేస్తాయి ? రూపాంతరం చెందిస్తాయి. నాశనం చెయ్యలేవు. రూపాంతరం చెందే లక్షణం ఆత్మకీ ఉన్నది. ఒకటిగా నున్న మహాచైతన్యం అనేకంగా ఆవిర్భవించటం రూపాంతరం కాదా ? విచ్ఛిన్నం కాలేదా ? సూక్ష్మజీవుల (Bacteria) ప్రత్యుత్పత్తి 1-2గా, 2-4గా, 4-8గా .... 1000-2000గా మారటం సృష్టిలోని మూలసూత్రాన్ని గుర్తుచేస్తోంది. Static energy (పురుషుడు) లోంచి Dynamic energy (ప్రకృతి) ఆవిర్భవించింది. మారేది మారని తత్వంలోంచి పుట్టింది.

అనంతచైతన్య మహోదధిగా సృష్టినిపరికిస్తే గాలి తాకిడికి కెరటాలు పుట్టినట్లు, శక్తి స్పందనవలన చరాచర వస్తు ప్రపంచం తరంగాలవలె భాసిల్లటం తిరిగి అందే విలీనం కావటం అవగతమౌతుంది. సాగరజలానికి తరంగజలానికి ఆకృతిలో తేడాఉంది, కానీ పదార్థం ఒక్కటే.

సృష్టి వేరు, సృష్టికర్త వేరు

పదార్థం వేరు, పరమాత్మ వేరు

జగత్తు వేరు, జగన్మాత వేరు - అనేదే శరీరం వేరు - ఆత్మ వేరు అనే విభేదానికి (differentiation) పునాది. మన పరిమిత తత్వమే ఇందుకు కారణం.

కాని అనంత శక్తిస్వరూపిణి అమ్మ - పార్థివ శరీరం కూడా ఆత్మ స్వరూపమనే పూర్ణతత్వాన్ని వెల్లడిస్తూ, "శరీరం ఆత్మకాకపోలే"దని అంటూ "అది కానిది ఏదైనా ఉన్నదా?" అని ప్రశ్నించటంలోనే ఇక సంశయాలకు స్థానం లేకుండా full stop పెడుతుంది. కనుకనే

"మీరు నా బిడ్డలు మాత్రమే కాదు.

నా అవయవాలు" అని అంటుంది.

"ఇదంతా నేనే, మీరంతా నేనే, మీదంతా నేనే" నంటూ అందరినీ, అన్నిటినీ "తాను"గా చూసుకుంటుంది.

6. ప్రజ్ఞానం బ్రహ్మ అయితే అజ్ఞానం బ్రహ్మ :

తొలిసారిగా సృష్టించబడిన Adam, Eve దంపతులు Eden అనే తోటలో నిరవధికహాయిని అనుభవించేవారు. వారికి మనం అనుకునే విచక్షణ లేదు, విశ్లేషణ లేదు. గొప్ప-చిన్న తెలియదు. వారికి జ్ఞానం (Knowledge) లేదు. సిగ్గు అంటే తెలియదు. వంటికి అచ్ఛాదన అవసరం అనీ తెలియదు. వారు పరస్పరానురాగంతో, విశేషించి దేవునిపై అచంచలమైన విశ్వాసంతో ఉండేవారు. ఒకసారి Adam అంటాడు-

Best are all things as ordained by the God,
Nothing imperfect or dificient left - అని.

(ఈశ్వర సృష్టిలో అన్ని వస్తువులు ఉత్తమమైనవే. ఏ ఒక్కటి అసంపూర్ణంగా కాని, అసమర్థతతో కాని విడిచిపెట్టబడలేదు). శని మాటలవల్ల మంచి-చెడు విశ్లేషణకలిగి వారు పతనమై పోయారని Christianity చెపుతుంది. మంచి-చెడూ విశ్లేషణ, పరిజ్ఞానాన్ని పొందటం 'మొదటి నేరము (Original sin)' గా పేర్కొంటారు. ఇందువలన వారికి అమృతత్వంపోయి మర్త్యులు అయినారు. శాశ్వతమైన ఆనందాన్ని కోల్పోయారు. వారిని అటువంటి నీచస్థితికి దిగజార్చిన శనిమాటలలో (తియ్యని వక్రభాష్యం) అతి ముఖ్యమయినది.

'What are Gods, that man may not become? I question it ...' అనేది.

(మానవుడు ఎప్పటికీ కాలేనంత గొప్పవాడా దేవుడు?) ఈ ప్రశ్న శనివరకు మాత్రమే పరిమితం కాదు. నాడు, నేడు, రేపు ...నిరంతరం మేధావుల మస్తిష్కాన్ని తొలిచే కుమ్మరిపురుగు ఈ ప్రశ్న.

"What are Gods that man may not become ?" అనేది.

పురుషకారాన్ని పూర్తిగా విశ్వసిస్తూ, సకల సృష్టిని ఏదో శక్తి నడిపిస్తోందనే అంశాన్ని తిరస్కరించే హేతువాదులూ, నాస్తికులూ సైతం ఈ ప్రశ్నకి ఎంతో గౌరవాన్ని ఇస్తారు. యదార్థంగా దేవుని కనుగొన్న మహర్షులు, సిద్ధులు, మహాప్రవక్తలు ఎప్పుడూ సృష్టిని, సృష్టికర్తని భిన్నంగా చెప్పలేదు, చూడలేదు.

"ఎందెందు వెదకిన అందందే కలడు" అనీ "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనీ

"జీవో బ్రహ్మైవ నాపరః" - అనీ చెప్పారు.

భగవంతుడు ఎప్పుడూ -

నేను గొప్ప - నీవు తక్కువ,
నేను ఉత్తముడను - నీవు అధముడవు,
నేను పరమపూజ్యుడను - నీవు దౌర్భాగ్యుడవు,
నేను సర్వసమర్థుడను - నీవు అసమర్థుడవు - అని అనలేదు.
ప్రతి సైన్సు విద్యార్థి Einstein అంతటివాడు కాదు,
ప్రతి పుస్తకం భగవద్గీత, బైబిల్ అంత పవిత్రం కాదు,
ప్రతి కవి కాళిదాసు, Shakespeare కాదు,
ప్రతి తల్లి అమ్మలకన్న అమ్మ కాదు.
కాని ప్రతి అణువు చైతన్యస్వరూపమే;
ప్రతిజీవి పరమాత్మే అని - అనేకులు అనేక విధాల చెప్పారు.

అన్నం బ్రహ్మ అనీ,
ప్రజ్ఞానం బ్రహ్మ అనీ,
శబ్దం బ్రహ్మ అనీ-
సృష్టిలో ఒక విభాగాన్ని మాత్రమే స్పృశించారు.
సౌందర్యం - వికారం,
సంపద - దారిద్ర్యం,

వెలుతురు-చీకటి-రెండూ అదే అని అమ్మ సంపూర్ణతత్వాన్ని ప్రబోధిస్తుంది.

చీకటినీ, దారిద్ర్యాన్నీ, దుఃఖాన్నీ, వికారాన్నీ, అజ్ఞానాన్నీ, అశుద్ధాన్నీ కూడా బ్రహ్మమేననీ, అఖండ చైతన్యమయ స్వరూపమేననీ, అమ్మ మాత్రమే ప్రప్రథమంగా, ఘంటాపథంగా చెప్తోంది.

"నేను తల్లిని-నీకు, మీకూ....అందరికీ....పశుపక్ష్యాదులకూ, క్రిమికీట

కాదులకూ...."-అని తన సర్వమాతృత్వాన్ని ప్రకటిస్తూ....పశుపక్ష్యాదులనూ, క్రిమికీటకాదులనూ మాత్రమే కాదు, తేళ్ళు, పాములు మొదలయిన క్రూర జంతువుల్నీ, అంతకంటె బాధాకరమైన భయంకర రోగాల్నీ, అంతకంటె ప్రమాదకరమైన మనుషుల్నీ, వారి వారి విపరీత ప్రవృత్తుల్నీ తన ఒడిలోకి తీసుకుని, అలౌకికమైన వాత్సల్యాన్ని కురిపించి —

మీరే నా ఆరాధ్యమూర్తులు,

నా దృష్టిలో మీరు కోదండపాణులే,

మీరు కానిది నేనేమీ కాదు—అని తనకూ మనకూ అభేదత్వాన్ని చాటుతుంది. కనుకనే ఎవరినయినా, దేనినయినా నిరసించడానికి, నిందించ డానికి, పరిత్యజించడానికి అమ్మ వ్యతిరేకిస్తుంది.

"పులి కడుపున పులిపిల్ల పుట్టింది,

జగన్మాత కడుపున జగత్తు పుట్టింది"

జగన్మాత అంటే ఈ జగత్తే" - అంటూ మనకూ, మహాచైతన్యానికీ మధ్య గోచరించే అడ్డుగీతని చెరిపేస్తుంది.

"సృష్టి వేరు - సృష్టికర్త వేరు" అనే భావానికి ఉద్వాసన చెప్ప మంటుంది.

మృణ్మయమే చిన్మయము,

నరుడూ నారాయణుడే - అనే వాస్తవాన్ని గుర్తించకుండా "What are Gods that man may not become? (మానవుడు ఎప్పటికీ కాలేనంత గొప్పవాడా దేవుడు?)" అని ప్రశ్నించటంలో ఔచిత్యం ఏముంది? విశ్లేషణ గారడీలో పడి; మన తెలివి ప్రదర్శించే తెలివి తక్కువతనం అవగాహన అయితే అజ్ఞానం బ్రహ్మ (Ignorance is perfect bliss) అన్న విషయం సువిదితం అవుతుంది.

7. సంతోషం - దుఃఖం
సౌందర్యం - వికారం ... అన్నీ ఒక్కదానివే :

వెలుతురు-చీకటి, సంతోషం-దుఃఖం, సౌందర్యం-వికారం అన్నీ ఒక్కదానివే-అని అమ్మ ఇచ్చిన వివరణ తేలికగా అవగాహన కాదు. అయినా అనుభవంలో గుర్తించడం అసాధ్యం. వికారం నుంచి సౌందర్యం వైపు పరుగుతీయటం సర్వసాధారణమే. మనం దేనినిచూచి భయపడి పారిపోతామో దానిని అమ్మ ఆప్యాయంగా దగ్గరికి పిలిచి తనలో జీర్ణం చేసుకుంటుంది.

మనకీ అమ్మకీ మధ్య ఎంత అంతరం ఉందీ!

ఎన్ని అంతస్తులు ఉన్నాయో!

భూమిని తన మాతృదేవతగా సంభావన చేసింది.

భూదేవి సహనానికి "సహజసహనం" అని నామకరణం చేసింది. మట్టిని బంగారంలా చూసింది.

బంగారాన్ని మట్టిలా విసిరేసింది. "సహనం" అనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజాద్రవ్యాలు కావాలని కష్టాలు వచ్చినప్పుడు ఇలా ధైర్యంగా యెదుర్కోవాలని చెప్పటం కోసమా?

బాధల తోరణం కాదు నాన్నా!

బాధలతో రణం - అని మనల్ని వెన్నుతట్టి జీవన సమరానికి సమాయత్తం చేసే అమ్మబోధలు శిరోధార్యాలు. "బాధలు లేని జీవితం కంటె చావు నయంరా" అని అమ్మ చెపుతుంటే మన శరీరం జలదరించక తప్పదు. బాధల బారినుండి తప్పించుకు పారిపోయి సుఖాల చల్లని వెన్నెలనీడలో పదికాలాలు ఉండాలని పూజలూ, ప్రదిక్షిణాలూ, నోములూ, వ్రతాలూ, ఉపాసనలూ, ఉపవాసాలూ చేస్తున్నాం. మానవ సహజమైన బలహీనతల్ని పరమేశ్వరునికి అంటగట్టి ఉపచారంచేస్తే ప్రసన్నుడవుతాడని, అపచారంచేస్తే

అగ్రహారదగ్ధుడై భస్మీపటలం చేస్తాడని కూడా ప్రగాఢంగా విశ్వసిస్తున్నాం. ఎన్నిచేసినా, ఏంచేసినా అవి తప్పటం లేదు.

కనుకనే అమ్మ "తనకున్నది తప్పదు" అని చెప్తోందా! ముందు చెడు జరుగుతుందేమో అని భయపడుతున్న ఒకసోదరితో అమ్మ – "కష్టాలకికూడా సిద్ధంగా ఉండాలమ్మా! సీత, సావిత్రి, హరిశ్చంద్రుడు కథలనుంచి గ్రహించిందేమిటి? వాళ్ళతో పోలిస్తే మనం ఏం కష్టాలు పడుతున్నాం? కాసేపు ఒక మాటతో అందరూ మనవాళ్ళే అనుకుంటాము. మళ్ళీ ఒక్కమాటతో నాకు యెవరూ లేరనుకుంటాము. మనస్సు యెప్పుడూ మారుతూంటుంది" - అని ధైర్యాన్ని కలిగి ఉండమని కోరింది. ఉలిదెబ్బలు శిల్పసౌందర్యాన్ని పెంచుతాయని గుర్తించమంటుంది. బాధలతో కూడినప్పుడే జీవితం చైతన్య తరంగితమౌతుందని ప్రబోధిస్తుంది.

కష్టాల్ని చూసి అమ్మ ఎప్పుడూ కంటతడి పెట్టలేదు. కన్నీటినిచూసి సార్ద్రనయన అవుతుంది. ఒకవ్యక్తి మంచితనమే అమ్మని కదిలింపచేస్తుంది. తనకి రాచకురుపుకూడా ముల్లుతో సమానం కాదు. "వాటికీ తల్లినే" అంటుంది. కాని మనకి కాలులో ముల్లు గుచ్చుకుంటే అమ్మకి కంట్లోగుచ్చు కున్నట్లే. వేదన అమ్మ హృదయాన్ని స్పందింపచేస్తుంది.

కనుకనే అమ్మ పరితప్తులకు ఆప్తురాలు, బాధితులకు ప్రియబాంధవి. ఈ "సంతోషం - దుఃఖం" రెంటికీమధ్య యెంతో అంతరం గోచరిస్తూంటే రెండూ ఒకదానివే అన్న సత్యం అర్థం అయ్యేదెలా?

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్సుఖితోపి జన్తుః"

అని కాళిదాసు అంటే; keats అనే కవి Beauty and joy are the real source of Melancholy (అందము మరియు ఆనందము విషాదానికి జన్మస్థానములు) అని అంటాడు. విచారం యెప్పుడూ ఆనందంతో కలిసి ఉంటుందనీ, అవి అవిభాజ్యం అని, విచారాన్ని అనుభవించాలంటే, అందమైన

వస్తువుల్ని చూడమనీ, సంతోషాలయంలో సుప్రతిష్ఠితమైన మూలవిగ్రహము విచారం (Melancholy has her sovran shrine in the very temple of Delight) అనీ గుర్తించమంటాడు.

భరించలేని సంతోషంతోనూ, భరించలేని దుఃఖంతోనూ ప్రాణాలను విడిచిన వారున్నారు. ఇటు ఆనందాన్ని, అటు దుఃఖాన్ని వాటి అవధులు (Extremes) అందేవరకూ అనుభవించిన వారికి మాత్రమే ఈ సత్యం వాస్తవంగా అవగాహన అవుతుందనీ చెప్పాడు. ఆ రకమయిన అనుభవం, పరిశోధన, సత్యాన్వేషణ .... అదే నిజమైన సౌందర్యారాధన. అట్టి వాస్తవికతయే నిత్యమూ శాశ్వతం అయిన సౌందర్యం. దానినే Truth is Beauty and Beauty is Truth అని అంటాడు. దీనినే సత్యం, శివం, సుందరం అనికూడా అంటారు.

హైమక్కయ్యతో ప్రకృతి వైద్యంపొందిన ఒక సోదరి హైమ పోయిందని దుఃఖిస్తున్నదంటే అమ్మ, "హైమ పోయిందని అంతగా దుఃఖిస్తోందని అనుకోను. అయినా అదీ ఒక ఆరాధనే. ఏడుపు అంటే కన్నీళ్ళు కాదుగా! వేదన అగ్ని హృదయంలో ప్రవేశించి, అన్ని రాగద్వేషాల్ని దగ్ధంచేస్తుంది. ఇదే భక్తి" అని అన్నది.

Melancholy has her sovran shrine in the very temple of Delight అని Keats ఇచ్చిన statement కి సంపూర్ణత్వాన్ని, అమృతత్వాన్ని ప్రసాదిస్తూ అమ్మ అందించిన వాస్తవ చిత్రణ -

"సంతోషం - దుఃఖం

సౌందర్యం - వికారం అన్నీ ఒక్కదానివే-" అనే సూక్తి.

8. అమ్మకి ప్రాపంచకమనీ, పారమార్థికమనీ రెండు లేవు :

కంటికి అగుపించే ఈ జగత్తుకి భిన్నంగా పరమాత్మలేడని ప్రవచించే అమ్మ ప్రాపంచికము, పారమార్థికము అనే భేదాన్ని చూపించదు; రెంటికీ

సమాన విలువనే ఇస్తుంది. మనిషి అవసరాల్ని, సమాజం అవసరాల్ని అమ్మ గుర్తించినంతగా మరొకరికి తెలియదు. మూఢనమ్మకాల్ని, అంధవిశ్వాసాల్ని, బలహీనతల్ని తెగనరికి నిస్తేజము, నిర్వీర్యము అవుతున్న ఈ తరాలకి ఊపిరిపోసి, క్రాంతిపథంలో నడిపించే ఉజ్జ్వల శక్తిమయి అమ్మ.

ఒక సోదరుడు : గాయత్రీ మంత్రం అందరూ చెయ్యవచ్చునా?

అమ్మ : నీ మనస్సుకి నచ్చినదీ నీకు హాయి కలిగించేదీ నువ్వు చెయ్యోచ్చు. ఒకరు చెప్పేరని అది గొప్పదనుకోవడము ఎంత వెర్రో, ఒకరు కూడదన్నారని తప్పనుకోవడమూ అంత వెర్రే. నీకు అదే కావాలని ఉంటే కానియ్యి.

సోదరుడు : మీరు ఎవరినీ సాధన చెయ్యవద్దని అంటారట.

అమ్మ : నీకు సాధ్యమైనదే సాధన. ఒకరు చెప్పినదీ కాదు, నువ్వు చేద్దామనుకున్నదీ కాదు, నువ్వు చెయ్యగలిగింది. ఎవరినీ సాధన చెయ్యవద్దని అనలేదు.

అఖండనామం, అఖండజ్యోతి, నిరతాన్నదానం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలూ, శ్రీ లలితా సహస్రనామార్చనలూ నిత్యకార్యక్రమములో భాగాలే. మనం సమిష్టిగా శ్రీ లలితాకోటి నామార్చన చేశాము. అమ్మ ఆశీర్వచనంతో మండలదీక్షగా కోటిగాయత్రీ జపం చేయటానికి సిద్ధంగా ఉన్నాయి. కాబట్టి అమ్మ బోధలలో అకర్మణ్యత్వం లేదు.

జిల్లెళ్ళమూడిలో ఉన్న అందరింటిని గురించి ప్రస్తావిస్తూ, ఇది ఆశ్రయమే కాని ఆశ్రమము కాదు. యెవరికి తగిన పని వారికున్నది; ప్రతివ్యక్తి తాను కష్టపడి తన కష్టంతో మరొక వ్యక్తికి అన్నం పెట్టాలి, అంటుంది అమ్మ.

విధి నిర్వహణకే, నిత్యకర్మానుష్టానానికే అమ్మ ప్రాధాన్యమిస్తుంది. అనుభవసాధ్యమైన (PRACTICABLE) అంశాలనే ప్రబోధిస్తుంది. కాషాయ

గుడ్డలుకట్టి కానలలో తిరిగినా, కాలు మడతవేసుకొని కూర్చొని కన్నులు మూసుకున్నా (ఆలోచనలు పోవు) సంకల్ప రాహిత్యం కాదు. "అన్ని సంకల్పాలూ ఆ శక్తివే" అనుకున్నప్పుడు మనదంటూ ఏదీ ఉండదు. "సర్వాన్నీ అనుభవిస్తూ సర్వాన్నీ విడిచిపెట్టేదే వివాహం" అంటూ గృహస్థాశ్రమంపై విశేషాభిమానాన్ని చూపిస్తుంది. జీవితంలో మనస్సుకు బ్రతుకుకూ ఎప్పుడూ పోరాటమే. ఆ రెంటికీ సమన్వయం ఉండదనీ వివరిస్తుంది. కొన్ని విపరీత మానసిక ప్రవృత్తులతో గుండె తూట్లుపడిన ఒక సోదరుడు, "రెండు మనస్తత్వాలమధ్య సంఘర్షణ తప్పదు కానీ కొందరితో మరీ కష్టము" అంటే అమ్మ - "జీవితంలో చూస్తున్నాం కదా నాన్నా! భార్యభర్తలు కానీ, తల్లీ బిడ్డలు కానీ, స్నేహితులు కానీ........ఇద్దరిలో యెవరో ఒకరు మొగ్గాల్సిందే" అంటూ, సర్దుకుంటూపోతేనే మనుగడ సాధ్యం అని గుర్తించి - అలా నడచుకోమంటుంది. మరొక సోదరునితో "నాన్నా! నీ కాళ్ళమీద నువ్వు నిలబడాల్సిందే. ఎవరో నీకు ఇస్తారని, చేస్తారని అనుకోవద్దు" - అని భవిష్యత్తుని గురించి జాగరూకత కలిగియుండమంటుంది. మరొక సోదరితో, "ఆయనికి పొయ్యి పెత్తనం, నీకు కర్రపెత్తనం యేమీ బాగాలేదు. ఆడది కానీ, మగవాడుకానీ ఎవరి హద్దుల్లో వాళ్ళుండాలి. లేకుంటే ఆ సంసారం అభాసుగానే ఉంటుంది" - అని అణుకువ, స్వధర్మ నిరతికలిగి యుండమంటుంది.

"వనౌకసోపి సంతః లౌకిక జ్ఞావయం" అన్న కణ్వమహర్షి మాటల్ని తలపింపచేస్తుంది.

కొన్ని కారణాలవల్ల ఒక సోదరి తమ కుమార్తె వివాహం అమ్మసన్నిధిలో జరుపుకోలేకపోయింది. వివాహానికి ముందు అమ్మ ఆశీర్వచనంకోసం వచ్చి, నమస్కరించి, "మంగళసూత్రం, తలంబ్రాలు నీ చేతిమీదుగా పంపించమ్మా. పెళ్ళిలో గొడవలు లేకుండా ప్రశాంతంగా జరిగేట్లు చూడు" అని అన్నది.

అమ్మ : తలంబ్రాలు, మంగళసూత్రం పంపుతాను. గొడవలు లేకుండా

అంటే .... పెట్టుకుంటే ఉంటాయి. కొందరు పెళ్ళిపెద్దలు అని పిలువబడేవారు అందుకు అసలు పనికిరారు. అటువంటివారిని పిలవకుండా ఉంటే, రాకుండా చేస్తే సరిపోతుంది.

ఆడపిల్లల వివాహ విషయాలలో సతమతమౌతున్న ప్రస్తావన పురస్కరించుకొని, "మగపిల్లలకి ఉద్యోగాలూ, ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు రెండూ సమస్యలుగానే ఉన్నాయి-" అన్నది.

"ధ్యాసే ధ్యానం" - అనీ,

"ఆరాధనే రాధ" - అనీ,

"కడతేరేవి మాటలు కాదు"-అనీ,

"మీ ఆవేదనలే నాకు నివేదనలు"-అనీ బాహ్య పటాటోపాలకీ ఆడంబరాలకీ అతీతంగా వాస్తవాన్ని గుర్తింపచేస్తుంది.

"నియమాలకు ఆచరించవచ్చును.

కానీ అతిక్రమించ కూడదు"అని హెచ్చరిస్తుంది. కనుకనే శ్రీ లలితా సహస్రనామ పారాయణ కర్తలను సహితం ఎట్లా చెయ్యగలిగితే, ఎట్లాసాధ్యమయితే అలా చెయ్యమంటుంది. పాలు త్రాగి చెయ్యొచ్చు, అల్పాహారం తీసికొని చెయ్యొచ్చు, ఉండలేకపోతే భోజనంచేసి కూడా చెయ్యొచ్చు.

అమ్మ దృష్టిలో దేవాలయంలో అభిషేకం చేసేవాడూ, పాకీదొడ్లుకడిగేవాడూ ఒకటే. అమ్మకు ప్రాపంచికమనీ, పారమార్థికం అనీ రెండు లేవు. ఎవరేంచేసినా అంతా దైవారాధనే - అంటుంది అద్వైతమూర్తి అమ్మ.

"సంసారబాధ్యతలే ఆధ్యాత్మిక సాధన" అంటూ ఏకకాలంలో ఐహిక ఆముష్మిక సమస్యల్ని పరిష్కరిస్తుంది.

కారణం....... అమ్మ మానవతా మాధవత్వ మధుర సమ్మేళనం.

... ఈ లోకానికి భిన్నంగా లోకేశుడు లేడనే అమ్మ ప్రవచనం.

9. సర్వసమాన దృష్టి :

"భిన్నత్వంలేని మన స్తత్వమే దైవత్వం" అని ప్రవచించిన అమ్మ దృష్టిలో అన్నీ అర్ధవంతములే, అందరికీ సార్ధకతే. వ్యర్థము, విసర్జనీయము అనే పదాల్ని అమ్మ అంగీకరించదు.

ఒకసారి ఒక సోదరుడు వారి పాపను ఎత్తుకొని అమ్మవద్దకు వచ్చాడు. "మా అమ్మాయికి ఎడమకన్ను మెల్ల, అదృష్టవంతురాలు అంటున్నారమ్మా-" అని అన్నాడు. వెంటనే అమ్మ, "నీ కడుపున పుట్టటమే అదృష్టం నాన్నా!" అని అన్నది. యెవరు ఆ మాట అనగలరు ? (Divine Love) దివ్యమాత ప్రేమకే అది సహజం సాధ్యం. అమ్మ మనల్ని అమ్మా, నాన్నా – అని పిలుస్తోంది. ఆ పిలుపులో అమ్మ మన అమ్మాయి అనే ధ్వనిలేదా? ఒకసారి విజయలక్ష్మి అక్కయ్య నాతో అన్నది. "అమ్మ చిన్నపాపాయిలా కన్పి స్తోంది. చంకనెత్తుకొని తీసికొని పోవాలని ఉంది" అని. అమ్మకి ప్రతి పురుషుడు సీతాపతి తాతగారి ప్రతిబింబము, ప్రతి స్త్రీ రంగమ్మ అమ్మమ్మగారి ప్రతిరూపు. Child is the Father of Man అని అంటారు కదా! కేవలం ఆ సోదరుని విషయంలోనే కాదు, ఇవాళ నేను, రేపు మీరు, ఎప్పుడయినా, యెవరితోనైనా అమ్మ ఆ విధంగానే అంటుంది. అమ్మ ఒకబిడ్డకు "ప్రేమ కుమార్" అని నామకరణంచేస్తే అన్నయ్య "ఎప్పుడూ ఆ పేరేనా?" అని అడిగాడు.

"మరి వాడెవరు?" అని ప్రశ్నించింది అమ్మ. ఆ బిడ్డ మనబోటి వారికి ఒకబిడ్డ కాని, అమ్మకి తన బిడ్డే. ఒక సందర్భంలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ రామకృష్ణ అన్నయ్య "నెల తక్కువకాని, వెల తక్కువకాదు" అని అభివర్ణిస్తాడు. ప్రేమానురాగాలకు, పెట్టుపోతలకు కాని భయభ్రాంతులకు అమ్మవద్ద స్థానంలేదు. అమ్మె చల్లనిచూపులలో శాపాన్ని కూడా వరంగా అనుభవించవచ్చు. మనుష్యులందరూ మంచివాళ్ళేనని ఉద్ఘాటిస్తూ అమ్మ మన కర్తృత్వానికి ఆధారభూతమైన ప్రేరణకే పాపపుణ్యాల్ని వదిలేస్తుంది. కనుకనే అమ్మ దృష్టిలో

సన్మార్గుడు, దుర్మార్గుడు
కరుణామయుడు, కిరాతకుడు
పండితుడు, పరమమూర్ఖుడు
సర్వసంగ పరిత్యాగి, సంస్కారహీనుడు

ఒకే విలువని, ఆదరణని కలిగియున్నారు, పొందుతున్నారు. అమ్మకి నారాయణుడూ బిడ్డే, నరకాసురుడూ బిడ్డే. అమ్మ దృష్టిలో అందరూ కారణ జన్మలే. అయినా సంఘంచేత నిర్లక్ష్యం చేయబడిన, విసర్జించబడిన బల హీనులు, నిందితులు, అనాథలు అంటే అమ్మకు అపారమైన దయ.

జీప్‌లో వచ్చిన తహశీల్దారుగారికి ప్రసాదం ఇచ్చాక, గది అవతల ఉన్న-వారి బంట్రోతునూ, క్రింద పందిట్లో కారులో అలిసిపోయి నిద్రిస్తున్న డ్రైవర్‌నూ పిలిపించి, బొట్టుపెట్టి నోటికి ప్రసాదం అందిస్తుంది. యెవరికి పెట్టుకోకపోయినా తనకు వెలితే. ఆ డ్రైవర్ అసస్థనుచూచి అంటుంది,

"వాడికి అన్నం తింటే నిద్రవస్తుంది,
తినకపోతే నీరసం వస్తుంది" అని.

"తల్లికి తప్పే కనపడదు" అని వినూత్నంగానూ, నిస్పష్టంగానూ ప్రకటించిన అమ్మ యెదుటవ్యక్తిలో మంచిని మాత్రమే చూస్తుంది. ఒకసారి అన్నపూర్ణాలయం రథసారథి అనబడే శేషయ్యగారిని గురించి ప్రస్తావిస్తూ "మహోదయంనాడు సుమారు పదివేలమంది జనం వచ్చారు. అప్పటికప్పుడు వచ్చారు. అందరికీ గంటన్నరలో వంటచేసి పెట్టారాయన. మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు అందరి భోజనాలుకూడా అయినయ్. ఆయనే అంటారుగా ఆ రోజున అట్లాచేసింది తన చెయ్యికాదని. మరి మాటలా అంతమందికి వంట చెయ్యటమంటే? మామూలు రోజులలో ప్రక్కన ఇద్దరు వంటవాళ్ళు ఉంటే నాలుగైదు పిండివంటలతో రుచిగా చెయ్యటం వేరు. గాలివాన (69లో) వచ్చినరోజున రేకులు అవి అడ్డుపెట్టి, వంటచేసి, మేడమీదకితెచ్చి అందరికీ భోజనాలు పెట్టారు, ఒకప్రక్క పాము కరచినా కూడా. ఆనాడు ఆయనపెట్టిన సాంబారు ఎంతో బాగుందని అందరూ త్రాగారు. ఆ రోజులలో

ప్రభావతి అక్కయ్య వందమందికీ ఒకత్తె అయినా భోజనాలు, టిఫిన్, కాఫీలు పెట్టి చేసింది. నా దృష్టికి ఇవే వస్తాయి-" అని అన్నది.

బషీర్‌బాబాగార్కి ఇడ్లీ పెట్టిన చేత్తోనే వారి గుమస్తాకి ప్రసాదం నోటికి అందించింది.

హైమకు భోగిపళ్ళు పోసిన చేత్తోనే మనందరికీ పోస్తుంది.

నాన్నగారి పాదతీర్థాన్ని తీసుకున్న చేత్తోనే మనందరికీ తీర్థంవేస్తుంది. అమ్మ ఆశీర్వచనానికి, అనుగ్రహానికి వ్యక్తి పాత్రత లేదు.

బోధగురువులుగా చెలామణి అవుతున్న బోధగురువుల్ని, బాధాకరమైన భయంకరమైన రోగాల్ని, నిస్సంతోషుల్ని, ఆర్ద్రితారహితుల్ని కూడా మన్ని స్తుంది, ఓదారుస్తుంది.

అమ్మ వజ్రోత్సవ సందర్భంగా, ఒక వేడుకగా రూపాయి నాణెములతో అమ్మను తులాభారం తూగమని, ఆ అవకాశం తనకు ఇమ్మని నరసాపురం సోదరులు కేశవరావుగారు వారి అభిలాషను వ్యక్తంచేయగా అమ్మ, "ఇందరు పిల్లలతో తూగుతున్నాను. ఈ భారం చాలు నాన్నా!" అన్నది చిరునవ్వుతో. కాని ఎంత యదార్థం చెప్పింది! మనం అమ్మకి పూజచేసిన తర్వాత, అమ్మ తిరిగి మనకి బొట్టుపెట్టి, మెడలో మాలవేసి, తలపె పూలుజల్లి, ప్రసాదం స్వయంగా తినిపించే ప్రక్రియను చూస్తే ఆ ఆశీర్వచనంలో ఆరాధన స్ఫురి స్తుంది. ఆరాధన అంటే అగరువత్తులు, అరటిపళ్ళు దీపారాధనకే పరిమితం కాదుకదా! స్థూలంగా సమాలోచన చేస్తే మనం వాన్ దిగినప్పటినుంచీ, మళ్ళీ వాన్ ఎక్కేవరకూ అమ్మకి మన గురించిన ధ్యాసే. "మీరే నా ఆరాధ్య మూర్తులు" అన్న అమ్మమాటలు అక్షరశః వాస్తవములు కనుకనే అమ్మకు భగవంతుడు బిడ్డే. బిడ్డా భగవంతుడే - అని, సర్వసమానదృష్టిని, అభేద దృష్టిని చాటుతాడు అన్నయ్య. "సర్వాభరణ సంశోభిత అమ్మ దృష్టిలో మట్టీ, మాణిక్యమూ ఒకటే"నని అంటాడు సినిమా వ్యాఖ్యానంలో. అంటే

అమ్మ శోభకి కారణం ఆభరణాలుకావు, అభేదదృష్టి - అని. ఈ విషయాన్నే వివరిస్తూ వెంటనే,

"బంగారాన్ని మట్టిలా విసిరేసిన సంఘటనలూ,
మట్టిని బంగారంలా చూసిన సందర్భాలూ అనేకం ఉన్నాయి"
అంటాడు.

ఎంత పోట్లాడినా పెట్టేది అమ్మ లక్షణం అయితే, ఎంతపెట్టినా పోట్లాడటం మన లక్షణం అవుతోంది. అమ్మది పరమార్థ దృష్టి. మనది పదార్థ దృష్టి. కనుకనే అసంపూర్ణ, అసంతృప్త మూర్తులుగా ప్రత్యక్షమవుతున్నాం. మన గుణదోషాల్ని యెంచని అమ్మ, మన అపచారాల్ని కూడా ఉపచారాలుగా యెంచి, సర్వ జీవజీవన సంజీవనిలా నిలుస్తోంది. అమ్మ యొక్క ఈ అవాజ్యకరుణని, అనంతప్రేమని, విచక్షణలేని వీక్షణని .. సర్వ సమానదృష్టి అంటాను.

10. అందరికీ సుగతే :

హైదరాబాద్ సెమినార్‌లో ప్రసంగిస్తూ పూజ్యశ్రీ లక్ష్మణయతీంద్రుల వారు అవతారంయొక్క పరమార్థాన్ని ఇలా వివరించారు - "అవతరణం అంటే క్రిందికి దిగటం అని అర్థం. కేవలం కరుణవలన భగవంతుడు మనల్ని ఆదుకోవటం కోసం, మనచేత సత్కార్మాచరణ కావించి, సత్పదార్థాన్ని దర్శింపచేయటం కోసం మనస్థాయికి దిగటం. ఎలాఅంటే ఒకనుయ్యి ఉంది. ఒకడు దృష్టిలోపం వలనో, అజాగ్రత్తవలనో, కాంతి హీనతవలనో ప్రమాదవశాత్తూ నూతిలో పడ్డాడు. మరొకరు అతనిని వెలికితీసి బ్రతికించటం కోసం అతని వెనుకదూకాడు. ఇద్దరూ నూతిలోనేపడ్డా - మొదటివాడు పడ్డాడు, రెండవవాడు దిగాడు-అంటాము. పడినవాడిని మరొకడు ఆదుకోకపోతే నశించిపోతాడు. దిగినవాడు తాను సురక్షితంగా పైకిరావటమే కాకుండా, అసహాయుణ్నికూడా పైకి చేదగలడు; మృత్యుముఖంలోంచి రక్షించగలడు. కనుకనే మానవులు పుట్టినపుడు భూమిమీద పడ్డారు అంటారు. భగవంతుడు భూమిమీద పుడితే "అవతరించాడు" అంటారు."

"అనన్యాశ్చింత యంతో మాం...." "ఏకాగ్రచిత్తంతో యెవరయితే నన్ను పూజిస్తారో వారి మంచిచెడ్డలు, రక్షణ నేనే వహిస్తాను" - అన్నారు గీతాచార్యులు. చేయగలగటం మనిషికి సాధ్యమయితే కదా!

"సాధ్యమైనదే సాధన" అనే త్రికాలసత్యాన్ని వినిపింపచేస్తుంది అమ్మ.

"కర్మణ్యేవాధికారస్తే...."అని పార్థసారథి చెబుతుంటే "చేతలు చేతుల్లో లే"వని అమ్మ ప్రబోధించటంలో వారి ప్రవచనాన్ని ఖండిస్తోందా? లేదు. నేటి సంఘానికి, కాలానికి, తరాలకి ఉపయోగకరమైన, ఆచరణ యోగ్యమైన సులభగ్రాహ్యమైన పద్ధతి అమ్మ సందేశంలో కానవస్తోంది.

కాలమో... కరుణో... యేది కారణమో తెలియదు. కాని అమ్మమాత్రమే ప్రపథమంగా అందరికీ సమాన విలువల్ని, సమాన అవకాశాల్ని సంతరిస్తోంది, ప్రసాదిస్తోంది. వారి వారి తప్పొప్పులను పట్టించుకోక, మంచిని మాత్రమేచూస్తూ అందరినీ వెనుక వేసుకొస్తోంది. తరతమ భేదంలేని ఈ అనుగ్రహ ప్రసారానికే ఆధ్యాత్మికచింతనలో సామ్యవాదం అని పదే పదే ప్రస్తావన చేస్తున్నాం.

అమ్మ అనురాగం అంతులేనిదీ.

ఆ అనుగ్రహం అర్థం కానిదీ-అని అంటాడు అన్నయ్య కనుకనే 17-2-84 తేదీన గాయత్రీయాగదీక్షా కార్యక్రమానికి ముందుగా అన్నయ్య, "మత ప్రమేయం లేకుండా, స్త్రీ పురుష భేదంలేకుండా, కులం, వర్గంతో నిమిత్తంలేకుండా యెవరికైనా అమ్మ గాయత్రీ జపదీక్షని ప్రసాదిస్తుంది. అయితే ఈ చర్య అన్యమతావలంబులను ప్రలోభపెట్టి హిందూమతంలోకి ఆకర్షించడానికి కాని, ప్రాచీన ఋషిప్రోక్తములయిన విధి నిషేధాలని ఖండించి, విమర్శించటానికి కాని ఉద్దేశించినది కాదు. అన్ని మంత్రాలకూ విలువఒక్కటే. ఆచరించ గలిగినవారికి పంచాక్షరి, అష్టాక్షరి, గాయత్రివలన ఫలితం ఒకటే. అయినా కొందరు స్త్రీలు, అబ్రాహ్మణులు "అయ్యో! గాయత్రీజపం చేసే అదృష్టం నాకు లేకపోయెనే - అభాగ్యులం" అనుకునే వారికోసం, సమష్టి

సాధనద్వారా రెట్టింపు ఉత్సాహంతో ఉత్తేజితులు కావాలనుకునే వారికోసం మాత్రమే ఇది నిర్దేశింపబడినది" అని అన్నాడు. ఏది ఏమైనా అమ్మమాత్రమే అంతరాలనీ, అంతర్యాలనీ పట్టించుకోక సర్వులకీ గాయత్రీ జపదీక్ష అనే భిక్షను ప్రప్రథమంగా ప్రసాదించింది. అనురాగామృత వర్షిణి అమ్మ ఆశీస్సులు నిరంతరం మనల్ని పునీతుల్ని చేయునుగాక !

విదేశీ సోదరుడు ఔత్రీవచ్చి అమ్మను గాయత్రీ జపదీక్షను ప్రసాదించ మని అడగగానే అమ్మ అతనికి ఉపనయనంచేసి, బ్రహ్మోపదేశంఇచ్చి, భిక్ష పెట్టి దీక్ష ఇచ్చిన సన్నివేశం అశేషజనావళిని ఆశ్చర్యంలోనూ ఆనందము లోనూ ముంచెత్తివేసింది. కొందరు కరతాళధ్వనులు చేశారు. కొందరికి విభ్రాంతి, మరికొందరికి భయభ్రాంతులు కలిగాయి. కొందరి గుండె కుదుట పడింది. మరికొందరిలో ఆనందతరంగాలు ఉవ్వెత్తునలేచాయి. విశ్వేశ్వరి, విశ్వకుటుంబిని అమ్మకు మాత్రమే అది సాధ్యం, "బహూనాం జన్మానాం అంతే"....అనేక కోటిజన్మల తర్వాత కైవల్యం అని చెప్పబడి ఉంటే,"సము ద్రంలోనుండి కెరటంలా వచ్చిన నీరు మరలా సముద్రంలో కలియనట్లు ఆ అనంతశక్తి సంజనితములైన ఈ పరిమిత రూపాలు మరలా ఆ అనంతంలో విలీనమౌతాయి" అనిచెప్పటంతో ప్రప్రథమంగా జీవరాశిఅంతా "హమ్మయ్య! బ్రతికాను" అని నిండుగా స్వేచ్ఛావాయువుల్ని పీల్చుకుంటోంది?

నేటికాలం, వాతావరణం హోరులో, జోరులో నియమనిష్ఠలతో కఠోర మయిన జపతపాదులను చేయటం వీరివలన కాదని అమ్మ బేషరతుగా "అంద రికీ సుగతే"నని అనుగ్రహించిందో లేక త్రికాలాబాధ్యమైన సత్యాన్ని వినూ త్నంగా ప్రప్రథమంగా వెలికితీసి ప్రకటించిందో....ఆ రహస్యాన్ని గురించిన పరిశోధన ఈ అల్పబుద్ధికి అప్రస్తుతం, అనవసరం, అసాధ్యం. మన మేలు కోరి అమ్మ చెప్పినట్లుగా పంచదార లడ్డు కావటంకంటె తినటం మేలు, హాయి.

అన్ని భేదాల్ని, అందరి గుణాల్ని, సంస్కారాల్ని పరిత్యజించిన అమ్మకు -

తాపసుడూ బిడ్డే, తామసుడూ బిడ్డే. పతితుడూ, పావనుడూ ఇద్దరూ కవలపిల్లలే. "వైద్యునికి రోగి నారాయణ స్వరూపుడే"నంటూ న్యాయాన్ని తిరగవేసి వైద్యునికీ రోగికీ, గురుశిష్యులకీ, భార్యాభర్తలకీ... అందరికీ ఒకే విలువను ఇస్తుంది. కాలక్రమంలో పరిఢవిల్లిన ముళ్ళడొంకల్ని నరికి, మెట్టపల్లాల్ని సరిచేసి, సమతలాన్ని, సమతని నెలకొల్పుతోంది. అనంత దూరంనుంచి తెచ్చిన వెలలేని బీజాల్ని ఈ ఎడారులలో చల్లి కల్పవృక్షాల్ని వర్ధిల్ల చేస్తూంది.

నాటకంవేసినవారికీ, ప్రేక్షకులకూ ఆడపెళ్ళివారికి, మగపెళ్ళివారికి.... అందరికీ ఒకే గౌరవం, ఆదరణ. ఈ విషయాన్ని సరళంగా వర్ణిస్తూ అన్నయ్య "క్రీడాభిరాములకు

క్రీడాభిమానులకు-సుస్వాగతం"

అంటాడు. క్రికెట్, కబాడీ ఆటలనే కాదు, జగన్నాటక కర్తగా కూడా అమ్మ, "నా దృష్టిలో మీరంతా బ్రహ్మలే" అంటూ సమాన విలువల్ని ఇస్తుంది. "అన్నీ వాడే చేస్తున్నాడనుకో" అనే అమ్మ సందేశంలోనే మన కర్తృత్వానికి ఆధారభూతమయిన మహత్సంకల్పం యొక్క స్వరూపం, స్వభావం వర్ణించ బడింది.

అప్రతిహతమైన ఆ మహాచైతన్యానికి లోబడి మన నడకలు, హెచ్చు తగ్గులు, సర్వద్వంద్వాలు యేర్పడ్డాయి. సర్వక్రియలూ దానివే .. దానిలోవే. కాబట్టి మానవదృష్టికి అగుపించే ఈకుబ్జలీల (దుష్ట సంస్కారము, లోపాలు, అశక్తత) అమ్మకు కనిపించదు. కనుకనే "అకారమే వికారంతో వచ్చిం" దని వివరిస్తుంది. ఈ వికారానికి (కుబ్జలీల) కర్తలు మనంకాదని, ఆ శక్తికి లేనివీ మనకి ఉన్నవీ యేవీ లేవనీ గుర్తించమంటుంది.

"అందరికీ సుగతే"నంటూ యేకకాలంలో అందరిపైన అనంతమయిన అనుగ్రహాన్ని వర్షింపచేస్తుంది.

అందుకే .... ప్రతి జల్లు స్వాతివాన,
ప్రతి జీవి ముత్యపుచిప్ప,
అనంత విశ్వం మహోదధి.

11. ముముక్షుత్వమే మోక్షము :

కంటికికనిపించే పదార్థతత్వానికి అతీతంగా ఉండే పరమార్థతత్త్వాన్ని అమ్మ దర్శింపచేస్తుంది. అంటే Materialism లో Spiritualism ని చూపిస్తుంది. "ఇది ఏమిటి" అనే విశ్లేషణద్వారా పరమార్థాన్ని గుర్తించటమే మనకి అమ్మ వెన్నతోపెట్టిన విద్య. రమణమహర్షులు తరచుగా "Who am I" (నేనెవరిని) అని ప్రశ్నించుకోమని బోధిస్తుండేవారు. అంటే జిజ్ఞాసువులు చివరలో సోఽహం అని తెలుసుకోవాలని వారి లక్ష్యం. ఒక డాక్టరుగారు ఇలా చేస్తే నిద్ర బాగావస్తోందని తెలియచేసారు. అమ్మ "ధ్యాసే ధ్యానం" అంటుంది. పూజా మందిరంలో కన్నులు మూసుకున్నప్పుడే ధ్యాస నిలబడాలని నియమం యేముంది ? ఎంత వేగంగా చేసినా ఈ సహస్రనామాలు ముగియటం లేదు అనుకున్నప్పుడు ఆ ధ్యానానికి, ఆ పూజకి అర్థం యేముంది?

మన సంతోషాన్ని పదిమందికి పంచటమే విందుయొక్క పరమార్థం అయినప్పుడు వారి పార్టీకంటే వీరి పార్టీ Grand గా ఉందని అనుకోవటంలో విజ్ఞత ఏముంది? ఔచిత్యం ఏముంది?

"మీ ఆవేదనలే నాకు నివేదనలు" అంటుంది అమ్మ. "రిక్త హస్తాలతో వచ్చానమ్మా" అంటే "రక్త హస్తాలతో వచ్చావు" అంటుంది. అనేక సందర్భాల్లో ఈ పరమార్థతని వర్ణిస్తూ అన్నయ్య,

"అమ్మ ఉయ్యాల ఊగుతోంది;
అమ్మకు ఈ జగత్తే తూగుటుయ్యేల",

"అమ్మ గ్రంథాలయాన్ని పరిశీలిస్తోంది;
అమ్మకు లోకమే పాఠశాల,
జీవితమే పెద్ద పుస్తకం,
ప్రతి అనుభవం ఒకపాఠమే"–అంటాడు.

"ముముక్షుత్వమే మోక్షము" అని మోక్షం అనేపదానికి అమ్మ ఇచ్చిన నిర్వచనం అపూర్వమైనది. మోక్షము అంటే విముక్తి. బంధించబడ్డాను అనుకునే వారికి విముక్తి. కర్మబంధాలచే బంధించబడ్డాను అనుకునేదీ మనస్సే, వాటినుంచి విముక్తుడనయ్యాను అనుకునేదీ మనస్సే అంటూ,

"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అని గీతలో చెప్పబడింది. "మోక్షం ఇచ్ఛుః ముముక్షుః" – మోక్షం కోరుకునేవాడు ముముక్షువు.

"మోక్షం కావాలనుకోవటమే దాన్ని పొందటం" అనేది అమ్మ నిర్వచనం సారాంశము. ఇతః పూర్వము ఏ జ్ఞాని, ఏ ప్రవక్తా, ఏ అవతార మూర్తీ ఇలా చెప్పలేదు. కర్మ సిద్ధాంతాన్ని అనుసరించి జీవుడు సంస్కార వంతుడౌతాడని, కర్మఫలాన్ని పొందుతూ అనేక జన్మలు ఎత్తుతాడనీ, యజ్ఞ యాగాలు, నోములూవంటి కామ్యకర్మలవలన స్వర్గలోక సుఖాలు కలుగు తాయి. పుణ్యఫలం నశించిపోగానే "మర్త్యలోకం విశన్తి" భూమిమీదపడ తాడని చెప్పారు; జపతపాదులవంటి నిష్కామ కర్మలవలన భవబంధ విము క్తుడై పునరావృత్తి రహితమైన కైవల్యాన్ని పొందుతాడని చెప్పారు.

జీవుని తొలిజన్మలోని కర్మాచరణకి ప్రేరణ ఆ శక్తిదే కాబట్టి చివరి వరకూ ఆ ప్రేరణ ఫలితంగానే కర్మాచరణ, ఫలప్రాప్తి కలుగుతున్నాయి; కాబట్టి వ్యక్తిత్వం లేదు - అనేది అమ్మ సిద్ధాంతం. అంతే అమ్మ పురుష కారాన్ని విశ్వసించదు. కనుకనే "తన ప్రయత్నం ఉందనుకోవటమే తాప త్రయం" అని నిర్వచిస్తుంది.

నీటిబుడగ పగిలి నీటి ప్రవాహంలో విలీనమైనట్లు అన్నీ మహా

చైతన్యంలో ఐక్యమౌతాయని, ఒకటి అనేకం కావటంవలన ఈ భిన్నత్వం గోచరిస్తోందని, ద్వంద్వాలు ఈ సృష్టికి ఆధారం కావటంవలన ఈ హెచ్చు తగ్గులు కనపడుతున్నాయని చెపుతూ వస్తుతః సృష్టికీ సృష్టికర్తకీ తేడాలేదని అమ్మ ప్రబోధిస్తుంది.

అద్వైత సిద్ధాంత ప్రవక్తలు శ్రీ శంకరాచార్యుల వారు "జీవో బ్రహ్మైవనాపరః" అన్నారు. మరి మోక్షం యెవరికి? అద్వైత సిద్ధాంతాన్ని విశ్వసించిన Shelley అనే కవి .... Die if thou wouldst be with that which thou dost seek ? Follow where all is fled...."మోక్షానికి సింహ ద్వారం మృత్యువని, దేనికోసం అన్వేషిస్తున్నావో దానితో ఐక్యం కావాలంటే తనువుని త్యజించమని, అందరూచేరే గమ్యమే నీకు అనుసరణీయము అని అంటాడు":

Mourn not for Adonais
He is made one with nature

"కీట్స్ కవి మరణించాడని యెవరూ విచారించవద్దు. తాను ప్రకృతిలో తాదాత్మ్యం చెందించబడ్డాడు - (చెందించబడ్డాడు అనటంలో విలీనం కావటానికి కూడా మన ప్రయత్నం అవసరంలేదని, అది ఒక సహజమైన పరిణామం అనేఅర్థం ఉంది.) ఇదివరలో కీట్స్ పరిమితరూపంలో చూడబడ్డాడు. ఇప్పుడు అనంత విశ్వంలో అంతర్లీనమయినా మహా చైతన్యంతో ఐక్యం కావటంచేత ప్రకృతిలో యెచ్చటనయినా చూడవచ్చు....పక్షుల్లో, కొండల్లో, నదులలో, గాలిలో, తమస్సులో, ఉషస్సులో, ఉరుముల్లో . అంతటా అతని ఉనికిని గుర్తించవచ్చు"-అని.

నాన్నగారు ఆలయప్రవేశం చేసిన సందర్భములో అమ్మ, "నాన్నగారు యెక్కడకూ వెళ్ళలేదు, వెళ్ళరు. మనతోనే మన మధ్యనే ఉంటారు. సృష్టిలో సహజమయిన పరిణామం జరిగింది. ఎవరూ దుఃఖపడాల్సిన అవసరం లేదు" అని ప్రకటించింది.

"నువ్వు చెప్పేదంతా ' చివరకు అద్వైతం దగ్గరకు తీసుకు వెళ్ళ

తుందమ్మా"-అని చిదంబరరావు తాతగారు అంటే" "నేను తీసుకువెళ్ళేదే మున్నది. అది అయ్యే ఉన్నది" అన్నది అమ్మ. తత్త్వపరంగా శంకరుల తోనూ, షెల్లీతోనూ అమ్మ యేకీభవిస్తుంది. "స్వభావమధురాయైనమః" అని వివరించబడినట్లు ఈ లీలాకల్పిత బ్రహ్మాండ మండలాన్ని ఈశ్వర సంకల్పిత కర్మాగారాన్ని కారాగారం అనుకున్నవాడు బంధితుడు, సర్వక్రియలకూ కర్త తానే అనుకునే ముముక్షువు విముక్తుడు, అన్నీ వాడే చేస్తున్నాడనుకున్న ప్పుడు స్వయంకృతాపరాధము అన్నదానికి తావులేదు, కర్మబంధాల ప్రసక్తి లేదు, మరణానంతరమే మోక్షప్రాప్తి అనే అపనమ్మకానికి అర్థమూ లేదు.

"సంకల్పమే సంసారం" అని నిర్వచిస్తూ అమ్మ "అన్ని సంకల్పాలూ ఆ శక్తివే అనుకునేదే సంకల్పరాహిత్యం" అని వివరిస్తుంది. సంకల్పరాహి త్యం అంటే భవబంధ విమోచనమే, మోక్షప్రాప్తే. సర్వసంకల్పాలకీ, సర్వ క్రియలకీ కర్త ఆ జగన్నాటక సూత్రధారి అయితే కర్మబంధాలు యెవరికి ? (నాస్తికునికి ఈ ధ్యాసే లేదు). కనుక జిజ్ఞాసువులకు ముముక్షుత్వమే మోక్షము.

కనుకనే బ్రహ్మత్వసిద్ధికని మనం చెయ్యవలసింది యేమిటి అంటే - "ఏమీలేదు" అంటుంది: "సాహిత్యంతో రాహిత్యంకాద"ని స్పష్టంచేస్తుంది అద్వైతామృతవర్షిణి అమ్మ.

12. సర్వం సర్వానికి ఆధారమే.

అమ్మ ఇచ్చిన ఈ వివరణ అపూర్వమైనది, సాటిలేనిది, మేటియైనది. అన్ని వస్తువులలోను ఈ ధర్మం ప్రస్ఫుటంగా వెల్లడిఅవుతుంది. మానవునికీ మాధవునికీ ఉండే పవిత్రబంధాన్ని కూడా చాటుతుంది. మాధవునిది పరి పూర్ణ స్వరూపం, మానవునిది అసంపూర్ణ రూపం. శివ సంకల్పం, స్వభావం అర్థం కావాలంటే ద్వంద్వాలకూ ఆధారభూతమయిన ఈ సృష్టిని పరిశీలిం చాల్సిందే, పరిశోధించాల్సిందే. సర్వలక్షణ లక్షితయైన పరాత్పరిని పాపా రణ్యదవానల అనీ కీర్తిస్తున్నాం, "సదామోహా నిద్రాదరిద్రాణ దివ్యానుభూతి

ప్రదాన ప్రదానాకృతే" అనీ కీర్తిస్తున్నాం. నామరూప గుణరహితమైనది, నామరూప గుణాత్మకమైనప్పుడే అభివ్యక్తమౌతోంది. సూర్యుని, నవగ్రహాల్ని యెవరు ఏ గొలుసుతో కట్టి పరిభ్రమిస్తున్నారు? అన్ని ఖగోళాలు పరస్పరం ఆకర్షణకు లోనై పరిభ్రమిస్తున్నాయి. ఇక్కడ పరస్పరం అన్నమాట విలువైనది. సూర్యునికి నవగ్రహాలు ఆధారం, నవగ్రహాలకి సూర్యుడు ఆధారం. మట్టిలో పెరిగినమొక్కలు వ్రేళ్ళను విస్తరింపచేసి ఆమట్టి కొట్టుకుని పోకుండా కాపాడుతాయి. Tape Recorderలో పాటపాడే శక్తి ఇనుప ఆక్సైడ్ పూత బెట్టిన Tape కు ఉన్నదా, అయస్కాంతానికి ఉన్నదా, బ్యాటరీకి ఉన్నదా, మోటారుకి ఉన్నదా-అంటే అన్నీ కలిస్తేనే. యే ఒక్కటి సక్రమంగా లేక పోయినా పనిచెయ్యదు. కలానికి వ్రాసే శక్తి, కాగితానికి అక్షరాల్ని ధరించే శక్తి ఉంటేనే వ్రాయటం సాధ్యం. కలం లేకుండా కాగితం, కాగితంలేకుండా కలంఉన్నా ప్రయోజనం యేముంది? పిచ్చిమొక్కలు అని పిలువబడేవి కూడా జీవనాధారమైన ప్రాణవాయువుని విడుదలచేస్తాయి. శాస్త్రవేత్త కళ్ళతోచూస్తే సూక్ష్మజీవులూ, క్రిమికీటకాదులూ, పశువులూ, పక్షులూ, మానవులూ, పరస్పరం ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి. రోగకారక క్రిములూ, మాంసాహారులైన క్రూరమృగాలూ కూడా సృష్టి నడకకి అత్యంత ఆవశ్యకములే. అమ్మ అందించిన "సర్వం సర్వానికీ ఆధారమే" అన్న వివరణ అక్షరాలా సత్యం. దేనిమీదా ఆధారపడకుండా, దేనికి చెందకుండా (Isolated) దేవుడు కూడా లేడు. ఒకరు అమ్మతో "దేవుడు యెవరికీ టచ్ కాకుండా ఉంటాడని అంటారు" అని అన్నారు. వెంటనే అమ్మ,

"దేవునితో నిజంగా టచ్ ఉన్నవాడు
దేవునికి మనకీ టచ్ లేదని చెప్పడు"

అని అన్నది. అన్ని అణువులూ, అన్ని వస్తువులూ, అన్ని జీవులూ, అన్ని ఖగోళాలూ ...సర్వం పరస్పరం ఆధారపడి వున్నాయి. సంఘపరంగా కూడా భార్యభర్తలు, అన్నదమ్ములు .... బంధువులు, మిత్రులు అందరూ కూడా అంతే. నేటి సమాజంలో నిర్లక్ష్యం చేయబడిన స్త్రీకూడా Interdependenceనే

కాని Independence ని మాత్రం కోరదు. అధికార్లు, అనధికార్లు, పాలకులు పాలితులు....యెవరయినా అంతే.

"భర్తకి భార్య దేవత,
గురువుకి శిష్యుడూ బ్రహ్మస్వరూపమే"

అని అమ్మ అతి సహజంగా న్యాయాన్ని తిరగవేస్తూ న్యాయసూక్ష్మాన్ని వివరిస్తూంటే అనుభవంలో దాన్ని యిముడ్చుకోలేక ఉక్కిరిబిక్కిరి కాగా గుడ్లు గూట్లోకి వస్తున్నాయి. అనుభవదూరమైన యీ విషయాన్ని అమ్మ చెప్పదు. నువ్వు విశ్వజననివి అని అంటే "మీరు కానిది నేనేది కాదు. మీరు నాపిల్లలే కాదు నా అవయవాలు" అంటూ తనకూ మనకూ పరస్పరం ఉన్న బంధాన్ని గుర్తింపచేస్తోంది. అనురాగబంధం కూడా అంతే. అమ్మ అన్నం పెడుతోంది, మనం తింటున్నాం. అమ్మ బట్టలు పెడుతోంది, మనం కట్టుకుంటున్నాం. మనం చేసే నివేదనలో కొంచెమైనా అమ్మ తినాలని, మనం పెట్టిన చీరె అమ్మ కట్టుకోవాలని కోరుకుంటాం. అలా కాకుంటే ఆ రాగబంధం ఒకవైపే ఉంటుంది.

20-5-84 తేదీన నేను కొన్ని అరటిపళ్ళు, కొన్ని మామిడిపళ్ళు అమ్మకి నివేదన చేశాను. ఎప్పటిలాగ అమ్మ పండ్లనుతాకి ప్రసాదంగా ఒకటి నా చేతిలో పెడుతుంది అని నిరీక్షిస్తున్నాను. అమ్మ 3 అరటిపళ్ళు తీసుకుని తిన్నది. అమితమైన ఆనందం కలిగింది నాకు. ప్రసాదంగా ఇచ్చిన పండు తీసుకుని గుమ్మందాటి వస్తూండగా వెనక్కిపిలిచి అమ్మ, "ఒక మామిడిపండు కూడా కోసి నీ చేత్తోపెట్టు నాన్నా" అన్నది. నా ఆనందానికి అవధులు లేవు. 2, 3 చిన్నచిన్న ముక్కలుతిని ఒకటి నాకుపెట్టి అమ్మ, "ఇంకచాలు అయాసం వస్తుంది. నువ్వు మాకూ అందరికీ పెడతావు; నువ్వు తింటూంటే చూడాలని ఉంది అని అన్నావు గుర్తు ఉందా? నువ్వు పెట్టావు, నేను తిన్నాను. మళ్ళీ నీకు పెట్టాను. మూడుపనులు అయ్యాయి" అని అన్నది. సర్వం సర్వానికీ ఆధారం అన్నది అనురాగబంధంలోనూ ఋజువయ్యింది కదా!

ఇంతేకాదు పరస్పర విరుద్ధమైన అంశాలుకూడా పరస్పరం బంధించ బడ్డాయి అని వివరిస్తుంది –

"చీకటే వెలుతురునకు ఆధారము,
అధైర్యమే ధైర్యానికి ఆధారము"

అని, అయస్కాంతాగ్రాలకి ఉత్తర దక్షిణ ధృవాలు విసిరివేయబడినా అవి పరస్పరం ఆకర్షించుకుంటున్నాయి, బంధించబడి వున్నాయి. కనుక సర్వం సర్వానికీ ఆధారమే

13. విశ్వాసమే భగవంతుడు :

ఎక్కడ నిరంకుశత్వం విశృంఖలంగా స్వైరవిహారం చేస్తుందో, ఎక్కడ దైవప్రతినిధులం అనే మేలిముసుగులో సామాన్యుల్ని పీడిస్తారో, వేధిస్తారో, ఎక్కడ మూఢనమ్మకాలు, మూఢాచారాలు పేరున జాతి నిర్వీర్యమౌతుందో, ప్రగతి ఆహుతి అవుతుందో అక్కడ ప్రకృతి స్పందిస్తుంది. ఒక విప్లవవీరుడో, ఒక కారణజన్ముడో, ఒక సిద్ధపురుషుడో, ఒక జ్ఞానో, ఒక అవతారమూర్తో అవతరిస్తారు. జగత్ సంక్షోభాన్ని ప్రళయాన్ని అడ్డుకుంటారు. సృష్ట్యాదిగా ఎందరో ప్రవక్తలు, ఋషులు, ద్రష్టలు, అవతారమూర్తులు జాతిని ఉత్తేజితం చేస్తూనే వచ్చారు. అయితే వారి ప్రబోధాలూ, ఉపదేశాలూ సార్వకాలీనాలు కాకపోవచ్చు, కొన్ని తత్కాలము వరకే లేదా ఆ వ్యక్తివరకే పరిమితమై వుండొచ్చు. కనుకనే అనేకానేక ఉపస్యామూర్తులు. ముక్తిమార్గాలు యేర్పడ్డాయి. ఒకసారి ఒక జిజ్ఞాసువు ఒక ప్రవక్తని, "మీరు వేదాంతచర్చలకీ; మతస్థాపనకీ ప్రాధాన్యం యిస్తున్నారు. సంఘంలో పెచ్చు పెరిగిన అవినీతిని, అధర్మాన్ని గురించి ఆలోచించరేం ?" అని ప్రశ్నించగా వారు, "రాముడు, కృష్ణుడు అవతారమూర్తులే కదా! కేవలం భగవంతుడే వచ్చి వెళ్ళినా ఇల్లు అలికి ముగ్గుపెట్టినట్లు అన్యాయం, అధర్మం పూర్తిగా తుడిచి పెట్టుకు పోలేదేం ? సంపూర్ణ ప్రక్షాళన జరిగిందనేది లేదు. అవసరాన్నిబట్టి అవతారమూర్తులు వుద్భవిస్తారు. కనుకనే "యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి" అన్నారు కృష్ణపరమాత్మ", అని చెప్పారుట.

అమృత కలశం

– కొండముది రామకృష్ణన్నయ్య
అమ్మ అంతరంగిక కార్యదర్శి
జిల్లెళ్ళమూడి, గుంటూరు-జిల్లా.

వాత్సల్యపు ఉగ్గుపాలను పోసి—
మానవజాతి చేత
విజ్ఞానపు గోరుముద్దలను తినిపించిన—
జగదీశ్వరీ, జగజ్జనని, జగద్గురువు అమ్మ,

ప్రసిద్ధులందరు సిద్ధులు కానట్లే - వక్తలందరు ప్రవక్తలు కానవసరం లేదు. ప్రవక్తలందరు వక్తలూ కానవసరం లేదు.

అప్పటిదాకా వెలుగులోకి వచ్చిన శాస్త్ర సారాంశాన్ని తమ సరికొత్త అనుభవాల వెలుగుతో మేళవించి - లోక సముద్ధరణ కొరకు, సమాజ శ్రేయస్సు కొరకు, వ్యక్తి వికాసం కొరకు, తమ జీవితాలనే అంకితం చేసిన మహానుభావులూ, మహాత్ములే ప్రవక్తలు. తమ వాక్కుతో, దృష్టితో, స్పర్శతో, సంకల్పంతో అవతలి వారి అంతరంగాన్ని వ్యష్టిగా, సమిష్టిగా స్పృశించి స్పందింపజేయ గలిగిన సర్వజ్ఞులు, సమర్థులు అయి ప్రతిభావంతులే ప్రవక్తలు.

అటువంటి ప్రవక్తలలో అమ్మ 'మహా ప్రవక్త' అని నా అభిప్రాయం.

అమ్మకు గ్రంథ పరమైన పాండిత్యం లేదు. కానీ అపారము, అపూర్వము అయిన తన అనుభవంతో అనేక అద్భుత విషయ సముదాయాన్ని అమృతకలశాన్ని లోకానికి అమ్మ అందించింది.

మత దురభిమానం మత విద్వేషానికి దారితీయగా హింసాచర్యలు, రక్తపాతం నేటికి కనిపిస్తున్నాయి. శ్రీ శంకరులు అద్వైత సిద్ధాంత ప్రతిపాదనద్వారా అనేకత్వాన్ని తొలగించి, మోక్షసాధనకి జ్ఞానం ఒక్కటే విశిష్టమైనదని ప్రకటించారు. శ్రీమద్రామానుజులు, శ్రీమధ్వాచార్యులవారు భక్తి ప్రపత్తిని, శరణాగతిని విశేషంగా చాటారు. వేద విహిత కర్మానుష్ఠానానికి వీలుపడని సంఘాన్ని దృష్టిలో ఉంచుకుని వల్లభాచార్యులవారు పుష్టిమతాన్ని స్థాపించారు. భగవంతుని యెడల ప్రేమని ఉద్బోధించారు. చైతన్యప్రభువు, మీరాబాయి, కబీరు, రామదాసు విశేషంగా భక్తితత్వాన్ని వెలుగులోకి తెచ్చారు. రామకృష్ణపరమహంస, రమణమహర్షి భక్తి జ్ఞాన వైరాగ్యమార్గాల పరాకాష్టస్థితికి ప్రతీకగా నిల్చారు. క్రైస్తవమతంలో కూడా ప్రార్థనకి, పశ్చాత్తాపానికి విశేషమయిన ప్రాధాన్యం యిచ్చారు. ఎన్ని నేరాలు, పాపాలు చేసినా పశ్చాత్తాప పరితప్తుడైన వానికి పరలోకరాజ్యంలో తండ్రి (ప్రభువు) పాదాలవద్ద స్థానం ఉంటుంది - అని.

కానీ అమ్మ విధానమే వేరు. అమ్మదృష్టిలో పుణ్యాత్ముడూ,పాపాత్ముడూ అనే భేదం లేదు. మొక్కినవారు, మొక్కనివారు అనే తేడాలేదు. సర్వక్రియలకూ కర్త ఆ భగవంతుడే నని చెప్పి, మనుషులందరూ మంచివాళ్ళేనని ప్రప్రథమంగా ఎదపై పన్నీటిజల్లు కురిపిస్తుంది. యే నామాన్ని అయినా జపించవచ్చు, యే రూపాన్ని అయినా ఆరాధించవచ్చు అంటుంది. అయితే అందులో విశేషం ఏముంది? విశేషమేమంటే అలా చెబుతూనే ఏదీ చేయలేని వారు యేదో ఒకటిచేసి తీరాలని, యెవరినో ఒకరిని నమ్మితీరాలని, అమ్మ నిర్బంధం చేయదు. అమ్మ దృష్టిలో అందరికీ అంతటికీ ఒకే విలువ. సంస్కారవంతుడు, సంస్కారహీనుడు, నిష్ఠాగరిష్ఠుడు, కర్మభ్రష్ఠుడు అందరికీ అమ్మ హృదయంలో ఒకే స్థానం.

"విశ్వాసమే భగవంతుడు" అనే ఆ(నా)స్తికురాలు అమ్మ దేవుడుతప్ప యెవరూలేరు అనేవాడు ఆస్తికుడూ, తాను తప్ప ఎవరూలేరు అనేవాడు నాస్తికుడు అంటూ ఇరువురికే విశ్వాసమే కారణం అన్న విషయాన్ని తేటతెల్లం చేస్తుంది. అందరికీ మనస్సే దైవం. ఇది త్రికాల సత్యం. కనుకనే అమ్మ-

"నీకు తోచింది చెయ్యి" అంటుంది. "ఇది నా అనుభవం నాన్నా! నమ్ము, నమ్మకపో, మనం ఎంతగా అనుకున్నా ఆ శక్తి అనుకోనిదీ చేయించనిదీ మనం అనుకోలేము, చేయలేము" అనే సత్యాన్ని గుర్తింపచేస్తుంది.

"నీవు చేయగలిగిందే నీకు సాధన" అని స్పష్టంచేస్తుంది. "సర్వ సమ్మతమే నా మతం" అని ప్రకటించిన అమ్మ ఏ సిద్ధాంతాల్ని నిర్దేశించదు, నిరసించదు. అమ్మ పూర్వ సిద్ధాంతాల్ని పూర్వపక్షం చేసారనటం అర్థరహితం. అమ్మ సత్యాన్వేషి. "పంచభూతముల సమ్మేళనమే గాయత్రి" అని నిర్వచించింది. ముక్తా విద్రుమహేమనీల ధవళచ్ఛాయలు పృథ్వ్యాపస్తేజో వాయురాకాశాలకు సంకేతాలు. సహస్ర శీర్షాపురుషః అని వర్ణించబడిన చైతన్యస్వరూపము గాయత్రి అనేటప్పుడు పంచశీర్షములు అయిపోయిందేమిటి? అంటే విశ్వామిత్రమహర్షి పరాశక్తిని పంచభూతాత్మకమయిన ఈ అనంతవిశ్వంగా యెరిగిన ద్రష్ట, బ్రహ్మదేవునికి, శివునికి కూడా పంచముఖములు ఉన్నాయని కీర్తించటంలో భావం ఇదే. పంచభూతములు ముఖపంచకము అని త్రికాలములు నేత్రత్రయమని, అద్వైతము ఆదిదేవుని ఆదియోగమని కీర్తిస్తున్నాము కదా!

"జగన్మాత వేరు జగత్తు వేరుకాదు,
జగన్మాత అంటే జగత్తే"

అని ప్రవచించిన అమ్మ గాయత్రి అంటే పంచభూతాత్మకమైన ఈ సృష్టికి భిన్నంగా ఎట్లా నిర్వచించగలదు? అందుకే పంచభూతముల సమ్మేళనమే గాయత్రి అని సులభమైన రీతిలో వాస్తవాన్ని కళ్ళకి కట్టినట్లు ప్రకటించింది.

అమ్మ యదార్థవాది. కాబట్టే అమ్మ పలికే
ప్రతివాక్కు ఒక బుక్కు.
ప్రతి మాట ఒక మంత్రం.
ప్రతి నిర్వచనం ఒక ప్రవచనం.
అమ్మ స్తవానికి కాక వాస్తవానికి విలువనిస్తుంది.

ప్రప్రథమంగా వాస్తవచిత్రణ చేసినందులకే Shakespeare మహాకవికి ఆంగ్లసాహిత్యంలో విశిష్టమైన స్థానంఉంది. జగన్నాటక కర్త అమ్మ, జనుల నాటక కర్త ఆయన. నిజ జీవితంలోవలె తన నాటకాలలో సుఖాంతము, దుఃఖాంతము అనే భేదాన్ని పాటించక, కష్టసుఖాల పరంపరని చిత్రిస్తాడు. ఒక్కొక్కసారి మంచిపాత్రలకి అన్యాయం, చెడ్డపాత్రలకి న్యాయంచేస్తాడు. కొన్ని పాత్రల్ని ఎక్కడికో తీసికొనిపోయి వదలేస్తాడు. మహారాజులో మూర్ఖత్వాన్ని, పిచ్చివానిలో వివేకాన్ని చూపిస్తాడు. ఏకోదరులలో దేవతల్ని, దానవుల్ని వర్ణిస్తాడు. ముఖ్యంగా ఆయన రచనల్లో నీతిప్రబోధం (Didactic element) లేదనే అభియోగాన్ని తెచ్చారు. నీతిప్రబోధం అనేది వాల్మీకి, Milton ల వంటి Moralist ల కర్తవ్యం. నాటక కర్త ఉన్నది ఉన్నట్లుగా వ్యక్తపరుస్తాడు. సమాజానికి, మానవ ప్రకృతికి దర్పణం పడతాడు. ఒకటి అనేకం కావటం వలన ఈభిన్నత్వం, వైవిధ్యం గోచరిస్తుందని అంటుంది జగన్నాటక కర్త అమ్మ. బహుముఖ వ్యాప్తమైన ఈ లీలానాటక జగత్తులో శాపంకూడా వరమే నంటుంది, శిక్షణ కూడా రక్షణే అంటుంది.

అవసరాన్ని బట్టి అన్నీ విలువైనవే నంటుంది.

గరళం ప్రాణహరణానికేకాదు, సంజీవనిలా పనిచేసే గుణాన్ని, ప్రాణాధారమైన అన్నం జ్వరపీడితునిపట్ల విషతుల్యం అని గుర్తించ మంటుంది.

నిరంతరం అమ్మదృష్టిలో మెదిలేది 'పుణ్యక్షేత్రాలూ, పవిత్ర తీర్థాలూ మఠాధిపతులూ' కాదు. మురికివాడలూ, అనాథలూ, బాధితులూ, అమ్మ సహవాసం ఆవులతో గేదెలతోనే కాదు కోడెలతో కోడెనాగులతో పశుపక్ష్యాదులూ క్రిమికీటకాదులే కాదు భయంకర రోగాలూ అమ్మకు ప్రేమాస్పదములే. అమ్మ వడిలో నారాయణుడూ, నరుడూ, నరకాసురుడూ పసిపిల్లలే, ఈ అనసూయమ్మవడిలో దత్తాత్రేయ స్వరూపత్రిమూర్తులే.

శృతేః భిన్నాః స్మృతయశ్చ భిన్నాః
మహామునీనాం మతయశ్చ భిన్నాః అనేది ఆర్యోక్తి.

అమ్మ మాత్రమే అన్ని ఆశ్రమాలకూ ఒకే విలువ నిస్తుంది. సర్వాన్నీ అనుభవిస్తూ సర్వాన్నీ వదిలి వెయ్యటమే వివాహం అంటూ అన్ని ఆశ్రమాలూ ఒక స్థితిని ఆశ్రయించి ఉన్నాయని.

"ఉన్నవి ఉన్నట్లు అనుభవించగలిగితే,
చెప్పినవి చెప్పినట్లు చేయగలిగితే,
తెలుసుకున్నాననేది తెలుసుకోగలిగితే అన్నిటికీ ఒకటే స్థితి"
—అంటుంది.

'దేశసేవా దైవసేవే' అంటుంది.

'నాస్తికునిదీ ముక్తిమార్గమే' అంటుంది. అశుద్ధమూ, అజ్ఞానమూ బ్రహ్మనంటూ అమ్మ మాత్రమే ఆధ్యాత్మికచింతనలో ప్రప్రథమంగా సామ్యవాదాన్ని ఆచరణాత్మకంగా ప్రబోధిస్తోంది.

"ఈ సృష్టికి భిన్నంగా సృష్టికర్త లేడు."

"విశ్వాసమే భగవంతుడు" అనే విప్లవాత్మక సత్యాలని సాధికారకంగా ప్రకటించే అనంత వాత్సల్యామృత రసవాహిని, అవ్యాజకరుణారసార్ణవం మన అందరమ్మ.

14. మీరు కానిది నేనేదీ కాదు :

మనం అమ్మదగ్గరికి పోవాలంటే రెండు అతస్థుల మెట్లు ఎక్కాలి. అమ్మ మనదగ్గరికి రావాలంటే రెండు అంతస్థుల మెట్లు దిగాలి. అంటే అమ్మకీ మనకీ మధ్య కొన్ని అంతస్థులు ఉన్నాయని, కొంత అంతరం ఉందని తెలుస్తోంది. తిరుపతిలో, అన్నవరంలో, విజయవాడలో వెంకటేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి, కనకదుర్గ ఎత్తైన కొండలపై వెలసి యుండటంలో అర్థం ఇదే. ఈశ్వరుడు సర్వోత్తముడు, సర్వోన్నతుడు అని తెలియపరచటానికే. కొండని ఎలాగైనా ఎక్కగలం. కానీ మనం అధిరోహించలేని మెట్లు ఉన్నాయి. వాటి పైనుంచి అమ్మ దిగివచ్చి, "మీరు కానిది నేనేదీ కాదు" అని అంటోంది. "మీరు నా పిల్లలే కాదు, నా అవయవాలు" అని అంటోంది.

1983 జూన్ నెలలో సర్వమంగళ అమ్మసన్నిధిలో నా భార్యకు సీమంతం వేడుక జరిగింది.

అమ్మ : ముందు వాడికి నమస్కారం చెయ్యి. వాడు ప్రధానం కదా!

నేను : భార్య భర్త అనే పేర్లు మేము పెట్టుకున్నవి, జగత్ భర్తవు నువ్వు. ముందుగా నీకే నమస్కారం చెయ్యాలి

అమ్మ : అయినా మీరంటే వాళ్ళకా గౌరవం ఉండాలి, వాళ్ళకి మీరు దేవుడే.

అయినా అనటంలో జగదీశ్వరిగా అమ్మ అంగీకరించటం మన సుకృతఫలం. మా పాపకి నామకరణం సందర్భంలో -

అమ్మ : ఏం పేరు పెట్టమంటావు?

నేను : నీ ఇష్టం అమ్మా..

అమ్మ : నీ నోటిమీదుగా చెప్పు, నువ్వేదో అనుకున్నావు కదా!

నేను : నీ ఇష్టమే మాకు ఇష్టంగా చెయ్యి,

అమ్మ : నువ్వు చెప్పు నాన్నా! నువ్వు చెప్పినా అదీ నా ఇష్ట ప్రకారమే. సంకల్పం నాదే కదా!

నేను : నీ పేరు పెట్టు.

అమ్మ : అ....న....సూ... య.

సర్వ సంకల్పాలూ తనవే నని సాధికారికంగా అమ్మ అంగీకరించటం, అభివ్యక్తం చేయటం కేవలం మన అదృష్టం. 'నీవు భూమిపై నిలిచిన తరి నే జీవించితి కడు ధన్యుడ నమ్మ' అని త్రికరణశుద్ధిగా తలపోసే కాలం మనది.

28-5-84 తేదీ. అన్నపూర్ణాలయంలో తోటకూర పప్పు, చింతకాయ పచ్చడీ, సాంబారు వేసి అన్నం పెట్టారు. అమ్మకి ఐతే ఇన్ని అవసరం లేదు. ఒక గ్లాసు నీళ్ళు, పళ్లెం - దగ్గు వచ్చినప్పుడు కళ్ళేవేసు కోవటానికి, పుక్కిలించటానికి, ఆ రోజున....

అమ్మ : B. P. 200 దాకా పెరిగింది రక్తంలో ఉన్నంత Suger Urineలో లేక పోవటమూ దోషమే నట. గుండెనెప్పి వస్తోంది.

నేను : డాక్టరుగార్ని పిలవమంటావా అమ్మా?

అమ్మ ; వద్దు ఎవరు మాత్రం ఏం చేస్తారు?

'సర్వ సంకల్పాలూ నావే' అన్నది. 'నీ అవసరం నీ కంటె నాకే బాగా తెలుసు' అన్నది. 'నేను మాత్ర వేసుకుంటే నీకు జ్వరం తగ్గుతుంది' అన్నది. అమ్మ తాకితే అనేకమంది రోగాలూ, భవరోగాలూ అంతరించాయి. అమ్మ పాదతీర్థంతో నీలాండ్ పునరుజ్జీవితుడైనాడు. అమ్మ కరుణామయ దృక్కులు మృతసంజీవని. అమ్మ పవిత్రనామస్మరణ సకల కలుషాపహారము, సర్వశివంకరము అవుతోంది.

'ఈ గోడలు నాకు అడ్డు కాదు' అనే అమ్మకీ, అన్నీ నావే.... అన్నిటికీ అమ్మే కారణం' అనే అమ్మకీ పరిమితమైన స్థితి' దృష్టి, శక్తి, రాగం కలిగిన మనకీ పోలిక ఏమిటి అంటే ఏమి లేదు. అయినా 'మీరు కానిది నేనేదీ కా'దని అంటుంది. కారణం అమ్మ ప్రప్రథమంగా ఇచ్చిన నిర్వచనం, "జగన్మాత అంటే-జగత్తే జగత్తే తల్లి. కనిపించే ఈ చెట్లు, కొండలు, నదులు జీవులు.... దీనికి భిన్నంగా లేదు-" అనటంతో అమ్మకీ మనకీ నడుమ ఉన్న అంతరాల్నీ అంతస్తుల్నీ నేలమట్టంచేసింది.

కాలినెప్పి కంటికి తెలియదు, కడుపునెప్పి చేతికి తెలియదు అన్నిం టినీ గ్రహించేది మనస్సే.

అలాగే సృష్టిలో ఒకరి వ్యధ మరొకరికి తెలియదు.

కాని అందరి బాధలు, గాథలు అమ్మకి తెలుసు.

అమ్మ జ్ఞాన ప్రసూనాంబ: ప్రజ్ఞానం, అజ్ఞానం రెండూ బ్రహ్మే అని ప్రవచిస్తుంది.

అమ్మ కరుణారస సింధువు: నరనారాయణులకు, దేవ దానవులకు ఒకటే విలువ.

అమ్మ కైవల్యదాత్రి: 'అందరికీ సుగతే' నని ప్రప్రథమంగా నిర్ద్వంద్వంగా ప్రకటించింది.

అమ్మ ఆత్మబంధువు: పిపీలిక (చీమ) బ్రహ్మకాకపోతేకదా? అని ప్రశ్నిస్తుంది.

అమ్మ స్వయం ప్రకాశమానమూర్తి: అందరినీ, అన్నింటినీ నేనే కన్నానని తన విశ్వమాతృత్వాన్ని ప్రకటిస్తుంది.

అమ్మ ఆది: (ORIGIN) అన్నింటికీ ఆధారమైనది.

అనాది: (NO ORIGIN) ఆద్యంతరహితమైనది.

అమ్మ అద్వైతామృతవర్షిణి: 'శరీరము ఆత్మకాకపోలేదు,' 'అంతా సత్యమే. మిథ్య ఏమీ లేదు' అని అంటుంది.

'జగమేలే పరమాత్మ! ఎవరితో మొరలిడుదువు?' అని ప్రశ్నిస్తే 'నాతో నేనే' అని తనకూ మనకూ అభేదత్వాన్ని చూపుతుంది. 'నన్ను పరీక్షిస్తున్నావా అమ్మా?' అని ప్రశ్నిస్తే 'నిన్ను పరీక్షించట మంటే నన్ను నేను పరీక్షించుకోవటమే' అని సమాధాన పరుస్తుంది. కనుకనే మీరు కానిది నేనేదీ కాదు." అనీ,

"మీలో నన్ను చూచుకోనప్పుడు కదా చిక్కు" అనీ వివరిస్తుంది.

15. చూస్తున్నదంతా నిస్వరూపమే.

కనిపించేదంతా నశించేది, చూస్తున్నదంతా తాత్కాలికం - కావున శాశ్వతమైనది, నాశనం లేనిది అయిన వస్తువు మనకి గమ్యం - అని తరతరా లుగా నూరిపోస్తున్నారు. పాశ్చాత్యకవులలో కూడా to speed up from transient to perpetual అనే ధోరణి ప్రబలంగా కన్పిస్తోంది. అనిత్యం, క్షణ భంగురం అయిన ఈ శరీరమును జీవుడు (వాసాంసి జీర్ణాని) చినిగిన వస్త్రం మాదిరి విసర్జించి మరొక దేహాన్ని ధరిస్తుంది - అని గీతాచార్యులు ఉద్ఘో షించారు. జనన మరణాలు దేహమునకేగాని ఆత్మ సనాతనమగు జ్ఞాన స్వరూ పము. శరీరం నశిస్తుంది కాని ఆత్మకు నాశనం లేదు - అనేది సంప్రదాయ సిద్ధం. 'ఆత్మై వేదం జగత్సర్వం' అనీ ప్రవచనం చేశారు. సర్వం అదే అయితే చిరిగిపోయిన వస్త్రం, శిథిలమైన శరీరం ఆత్మ స్వరూపం కాక మరే మైన అవుతాయా? అంటే పంచభూతాలు ఆత్మకాని పదార్థంతో భాసిల్లు తున్నాయా?

ఆత్మ కేవలం జ్ఞాన స్వరూపమైతే చూస్తున్నదంతా ఏమిటి? "జీవాత్మ, పరమాత్మ అని వేర్వేరుగా ఎందుకు చెప్పారంటే 'తను'గా ఉన్నది జీవాత్మ, 'పర' వేరుగా ఉన్నది పరమాత్మ" - అని అమ్మ సమన్వ యం చేస్తోంది. కాని "దేహాత్మ దృష్టియో (మూఢాః నాస్తికా పశుబుద్ధయః)"- అని అధ్యాత్మ రామాయణంలో ఘాటుగా చెప్పబడింది. దానికి సూటిగా "శరీరం ఆత్మకాక పోలేదు" అని స్పష్టంగా పల్కింది. శరీరం ఆత్మ స్వరూప మేనని ఇతః పూర్వం ఎవ్వరూ చెప్పలేదు. ఈ రకమైన దృక్పథాన్ని 'నాస్తి కత'గా నిరసిస్తారు కూడా.

తూర్పుగోదవరి జిల్లాలో మందపల్లి అనే గ్రామం ఉంది. అక్కడ శ్రీ శనీశ్వరాలయం ఉంది. శనిపీడనివృత్తికోసం వేలాది మంది అక్కడ ఈశ్వరునికి తైలాభిషేకంచేసి, తమ పీడని ఈశ్వరుని నెత్తిన తుడిచి, వెనక్కి తిరిగి చూడకుండా కార్లెక్కి పారిపోతారు. అయినాసరే ఇందరి శనిపీడని తాను నెత్తికెక్కించుకుని, భరిస్తానని, కంకణం కట్టుకున్నాడు ఆ పుణ్యశ్లోకుడు

శనీశ్వరుడు. అంటే శని (బాధలు) కూడా 'నేనే'అని చెప్పట లేదా?

కనుకనే - 'అక్ష్మీ స్వరూపిణి' అని అమ్మను అర్చించినప్పుడు - 'దారిద్ర్యంకూడా నేనే నాన్నా!' అని నిజం పల్కుతుంది. 'ఒడిదుడుకులు' తన ఆశీర్వచనమే అని గుర్తించమంటుంది. అజ్ఞానమూ, అశుద్ధమూ, అంధకారమూ... తోసహా సర్వం అదే నని ఘంటాపథంగా చెప్పుతుంది. పరమాత్మ ఎవరికీ అందనంతగా ఎత్తున 4 చేతులు, కిరీటంతో సుఖాసీనుడై ఉంటాడంటే....

నుదుట తర్వక్పుండ్రాలు, మెడలో రుద్రాక్షలు, చేత బిల్వ పత్రాల్ని ధరించి మహాదేవుని ఆలయ ప్రవేశం చేసి, నిఖిల జగత్తు రూపేణా భాసిల్లుతూన్న శివుని లింగాకారంగా చూస్తూ.... అనేకసార్లు చెప్పినదే చెప్పి, చెప్పినదే చెప్పే నమకచమకాల మంత్రార్థం ఏమిటి? అంటే - నిన్ను సృష్టికర్తగా మాత్రమేకాదు సకల సృష్టిగా గుర్తిస్తున్నాను. నీకు నమస్కారము. (నీ వారాశ్చమే, శ్యామాకాశ్చమే....), నాకు ఆహారాన్ని, ఐశ్యరాన్ని అనుగ్రహించు. బుద్ధిని శక్తిని ప్రసాదించు - అని! నిషాదేభ్యశ్చ ఓం నమోనమో, కులాలేభ్యో కర్మాలేభ్యశ్చ ఓం నమోనమో....కుమ్మరిగా ఉన్న నీకు నమస్కారము, కిరాతునిగా ఉన్న నీకు నమస్కారము, నమస్కారము - అని. ఈ మాటలు చిత్తశుద్ధితో చెప్పగలిగిననాడు తిర్యక్పుండ్రాలు, రుద్రాక్షలు, బిల్వ పత్రాలు... అవసరమే లేదు.

కనుకనే అమ్మ, "కనిపించేదంతా వాస్తవమే; మిథ్య ఏమీలేదు, అంతా సత్యమే" అని అంటుంది. 'మీరు మాలో దైవాన్ని చూస్తున్నారా?' అని ప్రశ్నిస్తే "మీలో చూడటం లేదు; మీరుగా చూస్తున్నాను" అని విస్పష్టంగా చెపుతుంది.

"మీ నిజ స్వరూపం చూపండి" అని అంటే, "చూస్తున్నదంతా నిజస్వరూపమే" అని తేటతెల్లం చెస్తుంది.

"శ్రీకృష్ణుడు నోట్లో విశ్వరూపాన్ని చూపించాడు కదా! ఏమి చూపాడు

నాన్నా! ఈ చెట్లు, కొండలు, నదులు, పూలు, పళ్ళూ, గుడులూ, గోపురాలు....
ఇవే కదా!"- అని గుర్తు చేసుకోమంటుంది.

ఇదివరలో అన్నం బ్రహ్మమనీ, ప్రజ్ఞానం బ్రహ్మమనీ, ఇది జడం అనీ, ఇది చేతనం అనీ సృష్టిలో ఒక భాగాన్ని మాత్రమే స్పృశించారు. భూమండలానికి ఒక వైపు వెలుగు, మరొకవైపు చీకటి ఉంటుంది. చీకటి వెలుగులు పరివ్యాప్తమైన మొత్తం ప్రాంతాన్ని భూమి అనాలి కాని వెలుగు రేఖలు ప్రసరించిన భాగమే అన్నప్పుడు అది సంపూర్ణమైన ప్రపంచం అవుతుంది.

"హెచ్చుతగ్గులు, సుఖదుఃఖాలు....సర్వద్వంద్వాలలో విలసిల్లే ఈ సృష్టే దైవం అని ప్రబోధించే అమ్మే నిజమైన ద్రష్ట. 'ఇదంతా మిథ్య, ఇదంతా సత్యం, ఇదంతా అనాత్మ' - అనే ప్రబోధం....?

కీటకముల (సీతాకోకచిలుక, ఈగ....) జీవితచరిత్రలో గ్రుడ్డు, లార్వా దశలు మన కంటికి కనిపిస్తాయి. పూపాదశ నిద్రావస్థ కాగా ఆ దశలో అనుహ్యమైన మార్పులు (తల, రొమ్ము, ఉదరం, రెక్కలు, కళ్ళు, కాళ్ళు) ఏర్పడతాయి. దీనిని సంపూర్ణ రూపక క్రియలు Metamorphosis అని అంటారు. అత్యంత అవసరములు, అనూహ్యమూ అయిన ఈ మార్పులు (మనం నిద్రావస్థ అని పిలిచే దశలో) సహజంగా జరుగుతాయి. పరమాత్మకి సహజం, మనకి విశేషం కదా! మానవులు వినలేని అతిశృతి ధ్వనుల (ultra sonic sounds) ను కుక్కలు, గబ్బిలములు, దోమలు వినగలవు. సృష్టిలోని ప్రతీ అణువు చైతన్య తరగింతమే-అని సైన్సు ధృవీకరించింది.

కనుకనే అమ్మ, "పిపీలికాది బ్రహ్మపర్యంతం అంటారేమి? పిపీలిక (చీమ) బ్రహ్మ కాకపోతే కదా!" అంటుంది.

'పశుబుద్ధయ్యః' అనేదానికి Show ఇచ్చిన సమాధానం - There is great wisdom in the simplicity of a beast, let me tell you, and at times, foolishness in the minds of great scholars.

'శరీరం ఆత్మకాక పోలేదు' అని అమ్మ చెప్పినపుడు అది సంపూర్ణత్వాన్ని ప్రతిబింబిస్తోంది. 'సంతోషం, దుఃఖం, సౌందర్యం, వికారం....అన్నీ ఒక్కదానివే' అన్నప్పుడు వాస్తవానికి దర్పణం పడుతోంది.

'ఈ లోకమే లోకేశ్వరుడు' అని చెప్పిన అమ్మే నిజమైన ఆస్తికురాలు. అమ్మలో నాస్తికత్వాన్ని కనుగొనేవారే నిజమైన నాస్తికులు.

16. మానవుని నడకకిఆధారం-రాగద్వేషాలు; నవగ్రహాలు కాదు

రెండు పడవల మీద కాళ్ళు పెట్టవద్దని అమ్మ పదే పదే చెప్పింది. అంతా వాడే (ఆ దైవం) చేస్తున్నాడని విశ్వసిస్తే మంచిదే లేక అంతా నేనే చేస్తున్నానని అనుకున్నా మంచిదే. కొంత మనది, కొంత దైవం అన్నప్పుడే చిక్కువస్తుంది.

సకల సృష్టిని ఒక అద్వితీయమైన అప్రతిహతమైన అనూహ్యమైన శక్తి ఒకటి పరిపాలిస్తోంది ద్రష్టాలూ, శాస్త్రజ్ఞులూ, ఉద్ఘాటించారు శ్రీ అరవింద మహర్షి అంతర్దృష్టి కలిగి. దేహంలో ఉండే దైవ స్వరూపాన్ని దర్శించి, పాంచ భౌతికసరిహద్దులు (Terrestrial boundaries) ని అధిగమించి, మృత్యుంజయతత్వాన్ని పొందమని అంటారు. Tagore గీతాంజలి తుది భాగంలో దేవునిచూశానని, ఎంతో ఆనందం కలిగిందని, పుట్టినందుకు సార్థకత కలిగిందని అన్నారు.

"దేవుడు మనకెవరికి టచ్ కాకుండా దూరంగా ఎక్కడో ఉంటాడటగా?" అని ఒకరు అమ్మను ప్రశ్నించగా, "నిజంగా దేవునితో టచ్ వున్నవాడు దేవునికీ మనకీ టచ్ లేదని చెప్పడు" అన్నది, తల్లి అంటే తరింప చేసేదని, అందరికీ సుగతేనని అమ్మ అనటంలో "రక్షించెవాడే భగవంతుడు" అనే ధ్వని లేదా?

కరుణారస సింధువు అని ఒక ప్రక్కకీర్తిస్తూ, ఆపదమ్రొక్కులవాడు అని మరొకవైపు నామకరణం చేస్తూ, కొండకి రాలేదని కొండంత దేవుడు తనపై ఆగ్రహించాడని అభియోగాన్ని తెచ్చి, అపార్థం చేసికోవటంలో ఔచిత్యం ఏముంటుంది? మ్రొక్కు అనేది పరమేశ్వరునితో ఇహలోక వ్యాపార భాగస్వామ్యమా? పూజలూ, అభిషేకాలూ, అర్చనలూ ఎవరి కోసం? భక్తులం అనుకుంటూనే విధివక్రిస్తే దైవాన్ని నిందించే స్వభావం ఏ కోవకి చెందుతుంది! కొబ్బరికాయ కొట్టమని ప్రాధేయ పడ్డాడా? నిందించే అవకాశం, అధికారం ఎవరిచ్చాడు?

'ఇష్టదైవం అంటే ఏమిటమ్మా' అని అడిగితే, "తాను ఏం చేసినా నీకు అయిష్టత కలుగదో అదే ఇష్టదైవం" అని అమ్మ వివరించింది.

"తను" మూలం మిదం జగత్ అని నిర్వచించింది అమ్మ. తను (వ్యక్తి) ఉంటేనే ఈ సంసారం.... తాపత్రయం. 'ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి' అనేది శృతి వాక్యం. కనుకనే మానవుని నడకకి ఆధారం రాగద్వేషాలు అని అమ్మ ప్రకటించింది. 'రాగం' అంటే ఇది కావాలి అని, 'ద్వేషం' అంటే ఇది వద్దు అని కనుకనే మానవుని నడకకి ఆధారం నవగ్రహాలు కాదు, రాగద్వేషాలు అని వివరించింది.

"సర్వదేవనమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి" అన్నట్లు నవగ్రహ పూజలూ, ఈశ్వరాభిషేకాలూ, సహస్రనామార్చనలూ, శ్రీచక్రార్చనలూ అన్నీ ఒక్క శక్తికే చెందుతాయి; ఏ రేవులో దిగినా ఒకే నదీజలం లభించునట్లు.

చాల మంది నవగ్రహాల్ని జ్యోతిషాన్ని గౌరవిస్తున్నట్లు కనిపిస్తారు. తను అక్కరికి రానపుడు దూషిస్తారు. మా మేనేజరు శనిగ్రహంలా పట్టుకున్నాడు అని, వాళ్ళు రాహుకేతువులుగా పీడిస్తున్నారని అంటారు. శాస్త్రరీత్యా ఫలానా గ్రహం ఎప్పుడూ మంచినే కలుగ జేస్తుంది అనేది లేదు. శుభగ్రహాలకీ నీచస్థానాలు ఉన్నాయి. పాపస్థానాల్లో పాపగ్రహాలైతే శుభాల్ని కలుగచేస్తాయి కూడా. పాపగ్రహాలని పిలువబడిన శనికి పీక నొక్కి చంప

టమే ప్రవృత్తికాదని, దీర్ఘాయుర్దాయ కారకుడని. కేతువు మోక్షకారకుడని కూడా శాస్త్రం చెబుతోంది. జ్యోతిషం అనేది నాలుగు గైడ్‌లు బట్టీ పట్టి సంపాదించే డిగ్రీకాదు; శాస్త్ర జన్యజ్ఞానానికి మిన్నగా అనుభవం అనేది ప్రధానాంశము. జ్యోతిషాన్ని గురించి మరొక అభిప్రాయం కూడా ఉంది— భచక్రాన్ని మేషాది ద్వాదశరాసులుగా విభజించి, జననకాల ఘడియల్లో ఆయా స్థానాల్ని గుర్తించి, అతఃపూర్వం క్రోడీకరించిన అనుభవాల్ని పురస్కరించుకొని ఫలితాన్ని నిర్ణయిస్తూ శాస్త్రిరచన చేశారు; అనుభవం, అధ్యయనం, అవగాహన ఇక్కడ ప్రధానాంశాలు; గ్రహస్థానాలు కేవలం సంకేతాలు (Indications) మాత్రమే; 7వ నెంబరు పతాకాన్ని ఎగుర వేస్తే తుఫాను వస్తుందని హెచ్చరిక అంటే తుఫానును తీసుకువచ్చే శక్తి 7వ నెంబరు పతాకానికి ఉన్నదా? అట్లా ఇవన్నీ సంకేతాలు; శనిగ్రహం వల్ల ప్రాణం పోతుందని కాదు—అని. సౌరకుటుంబంలో అన్ని గ్రహాల కంటె పెద్దది బృహస్పతి; భూమికి శని గ్రహం కంటె బృహస్పతి అతి చేరువులో ఉన్నాడు; పరిమాణంలో చూస్తే శని కంటె గురుడు చాల ఎక్కువ అని ఖగోళశాస్త్రిజ్ఞులు చెపుతారు.

'సంకల్పము-వికల్పము' రెండూ ఆశక్తివేనని అమ్మ ఇచ్చిన అపూర్వ ప్రబోధాన్ని త్రికరణ శుద్ధిగా విశ్వసించిన రోజున ఆ శక్తిగా నవగ్రహాల్ని ఆరాధించినా ఒకటే, సాంబశివునిగాని, శ్రీ మహావిష్ణువుని గాని మరెవ్వరిన అయినా ఒకటే 'Not a leaf moves but by his consent and his will'— అని అనుభవ పూర్వకంగా తెలుసుకొనవచ్చు. అమ్మ దృష్టిలో అనీ ఒకే శక్తి స్వరూపాలే, అనంత చైతన్య సంజనితాలే కాగా మానవసహజమైన ఈతి బాధలకి. వికారాలకి, దుష్టత్వానికి గ్రహచారమే కారణం అని అపుణ్య మూర్తులు (నవగ్రహాలు)ని బాధ్యుల్ని చేసి పరోక్షంగా దూషించే దౌర్భగ్యం ఒకటి ఉంది. దాన్ని షేక్స్పియర్ మహాకవి చక్కగా వర్ణించాడు-

'When are sick in fortune we make guilty of our disasters the sun, the moon and stats, as if we are villains on necessity, fools by heavenly compulsion, knaves, thieves and treachers by

spherical predominence, drunkers, liars and adulters by planetary influence——all that we are evil in by a divine thrusting on——an admirable evasion of man to lag his disposition to the charge of a star. ఈ దుస్థితికి శాశ్వతంగా అమ్మ స్వస్తి చెప్పింది. అదే అమ్మ ప్రవచన సారాంశము. ఒక్క వాక్యంలో చెప్పాలంటే. 'We are often betrayed by what is false within !

గ్రహచారంవల్ల ఇలా జరుగుతున్నదా లేక ఇలా జరుగుతుందని సూచించే సంకేతాలు అని అనేది వారి వారి నమ్మకాల మీద ఆధారపడి ఉంటుంది.

17. భిన్నత్వంలోని ఏకత్వం :

అమ్మను ఐదు సంవత్సరముల వయస్సులో 'లోచూపు తెలిపేదా' అని అడిగితే "ఉన్నది ఉన్నట్టుగా కనడమే లోచూపు" అని సమాధాన మిచ్చింది.

'పరమాత్మ చీమలో... దోమలో....ఉన్నాను' అని అంటే, "చీమగా.... దోమగా....ఉన్నాడు" అని సంపూర్ణ భావాన్ని, పరిపూర్ణ అద్వైత తత్వాన్ని అందించింది.

అయితే ఉన్నది ఉన్నట్టుగా అంటే మన కళ్ళెదుట వైవిధ్యం కనిపిస్తోంది. వస్తువులలో వైవిధ్యం, పదార్థాలలో వైవిధ్యం, వాని ధర్మాలలో వాటి తత్వాలల్లో వైవిధ్యం కనిపిస్తోంది. పరిణామశీలం గల ఈ సృష్టిలో భిన్నత్వమే అడుగడుగునా అగపడుతోంది. ఇన్ని రూపాలలో....ఇన్ని విధాలలో పరివ్యాప్తమైనది ఒకే వస్తువు, ఒకే తత్వము అని అంటే విశ్వసించటానికి మనకి ఆశ్చర్యంవేస్తుంది. అటువంటి వస్తువు లేక శక్తి ఉన్నది లేక ఉన్నాడు అని అంటే దానిని రమణీయమైనది, ఉన్నతమైనది, ఉజ్జ్వలమైనది, మంగళ కరమైనది, మహిమాన్వితమైనది అని అనుకోగలం, అంచనావేయ గలం గానీ మరొకరకంగా ఊహించలేము. అన్నీ అదే అంటే ఆశ్చర్యముతో

పాటు అనుమానమూ మనకు సహజంగా కలుగుతుంది. కారణం మన పరిమిత స్థితి, వెలుగును చూసి గొప్ప అనీ, చీకటిని చూసి తక్కువ అనీ మనం వేసే అంచనాలే.

పూర్వీకుల సాధనా ప్రక్రియయొక్క తత్వాన్నీ దాని అర్థాన్నీ వివరిస్తూ అమ్మ ఇలా అన్నారు.

"సహజంలోంచి విశేషాన్ని వెలికితీసి

దానిని మరల సహజంగా గుర్తించటం-" అని.

పక్షులలో గరుత్మంతుడినీ, పాములలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామినీ నేనే అని చెప్పకోవటంలో వాడి ఉద్దేశ్యం అన్నింట్లో నేను ఉన్నానని చెప్పకోవటం కోసమే. సాటి మానవుడినే సమానంగా చూడలేని మనం ఒక దుష్ట జంతువుని చూడగలమా? అందుకని అందులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని అన్నాడు. అంటే తతిమావి కాదని కాదు. నిగ్రహం కోసం విగ్రహారాధన ఎట్లాంటిదో అలాగ. అన్నింటిలో సర్వత్రా వాడు ఉన్నాడని తెలుసుకోవటం కోసమే."

"ఆవుపేడతో సందెగొబ్బెమ్మను చేసి మంగళగౌరీ పూజలు చేయటంలో అర్థం ఏమిటీ అని అంటే-అన్నీ అ శక్తి స్వరూపాలే అని పదే పదే గుర్తు చేసికోవటం కోసం....మరల మరల మననం చేసుకోవటం కోసం"అని అన్నారు. ఈ సందర్భంలోనే అమ్మ, "మంచిని మంచిగా చూస్తే అంతా మంచిగానే కనబడుతుంది. ఎదుటి వారిలో దైవత్వాన్ని చూస్తున్నంతసేపూ నీలో దైవత్వం కలుగుతుంది" అని అద్వైతసిద్ధి కోసమే మనకు పరోక్షంగా వుపదేశం చేశారు.

మంచిని మంచిగా.... ఉన్నది ఉన్నట్టుగా చూడటం అనే దానికి వివరణ, నామం చేయటంలోని విశేషార్థాన్ని వివరిస్తూ అమ్మ ఇలా అన్నారు.

"మన ఇంట్లో సప్తాహం జరిగిందనుకుందాం. నిరంతరం చేసిన నామం నీ శ్రవణ కుహరాల్లో ప్రతిధ్వనిస్తుంది. అక్షరానికి శబ్దం లేదు. ఉదాహరణకి ఓం అనే అక్షరానికి శబ్దం లేదు. దాన్ని వుచ్చరించటంతోనే శద్దం కలుగులోంది. శబ్ద స్వరూపమే నీకు ఓంకారంగా గోచరిస్తుంది. అపుడు పసివాని ఏడుపు, పశువుల అరుపు ...అన్ని శబ్దాలు ఓంకారంగానే వినబడతాయి" అని.

అంతటా.... అన్నిటా.... మంచిని చూడగల అమ్మ తనకు కులభేదమే కాదు గుణభేదమే లేదు అంటూ-

"మనుషులందరూ మంచివాళ్ళే నాన్నా!

చెడ్డవాడు ఒకడయినా ఉన్నాడూ అంటే — మనం అనుకునే ఈ చెడ్డ తనాన్ని మనకు ఇచ్చిన ఆ భగవంతుడు మాత్రమే" అన్నారు.

అంతటినీ, అన్నింటినీ ఒకటిగా చూడగల్గిన అమ్మ,

"భగవంతునికీ దుర్మార్గులున్నారా?
తనకి రెండు ఉంటాయా? దుష్టశిక్షణ, శిష్టరక్షణ....
అన్నీ తనలోనుండే వచ్చినయ్‌గదా?"

అని చిన్నతనంలోనే చిదంబరరావు తాతగారిని ప్రశ్నించారు.

మనం జగద్ధాత్రి అయిన జగదీశ్వరిని వరదాయిని, అభయ ప్రదాయిని అని మాత్రమే వర్ణిస్తాము, ఆ అదృశ్య శక్తిని సకల కళ్యాణగుణసంపన్న, సద్గుణమూర్తి అని కీర్తిస్తాము, వరదాయిని అని, ఆ శక్తిని మన ఇష్టదైవం అనీ, ఇచ్చినది సర్వమూ తానే అనీ.... అంటున్నాముగానీ యదార్థంగా అనుకోవటం లేదు. ఆ పరతత్వాన్ని అభయప్రదాయిని, ఆపదుద్ధారిణి అంటాము గాని మరొకరకంగా భావించలేము, 'ఆగమార్థంతు దేవానాం; గమనార్థంతు రక్షసాం' అని దైవీసంపత్తిని ఆహ్వానించి, అసుర సంపత్తిని వెడలగొడతాం. ఒక సందర్భంలో అమ్మ అన్నారు.

"నా దృష్టిలో ఆగ్రహానుగ్రహాలు లేవు. అంతా అనుగ్రహమే; కష్టసుఖాలూ, శుభాశుభాలూ.... అన్నీ అనుగ్రహం వల్లనే. ఇవ్వబడిన సర్వమూ వరమే. ఇక మ్రొక్కినవారు మ్రొక్కనివారు అని భేదం ఏమున్నది?" అని,

ఒక సోదరుడు ఏదో అడగాలనుకున్నాడు. అమ్మ! ఏమి అడగాలో తోచటంలేదు - అంటే అమ్మ, "ఏమీ అడగనవసరం లేదు నాన్నా! అమ్మ అంటే అడగకుండానే అవసరం గమనించి పెట్టేది" అన్నారు.

దారిద్రంతో బాధ పడుతున్నానంటే "నాయనా! దారిద్ర్యం కూడా నేనే" అని ఓదారుస్తుంది.

సకల సృష్టికర్త తాను అయినప్పుడు సకల సంహారుడూ.... లయకారుడూ తానే.

'దేవుడు ఎవరికీ టచ్ కాకుండా ఎక్కడో దూరంగా అంటాడని అంటారుగా' అని అడిగితే దేవుడుతో టచ్ ఉన్నవాడు దేవునికి మనకి టచ్ లేదని చెప్పడు, అన్నారు.

సుఖదుఃఖాలూ, చీకటి వెలుగులూ, శుభాశుభాలూ, రాగ ద్వేషాలూ, పుణ్యపాపాలూ, మంచిచెడులూ, సురాసుర గుణాలు....ఈ విధంగా ద్వంద్వాలకు ఆధారంగా ఈ సృష్టి ఉన్నది.

ఈ సహజస్థినుండి విశేషంగా కళ్యాణగుణాల్ని, ఉత్తమమైన తత్వాన్ని వెలికితీసి దానిని పరంజ్యోతిగా పేర్కొని ఆ ఒక్క తత్వాన్ని యదార్థంగా.... యథాతదంగా చూడగలిగితే రెండవదికూడా అవగాహన అవుతుంది. అంతా అదేనని తెలుస్తుంది. అంటే ఆ విశేషాన్ని మరల సహజంగా గుర్తించటం జరుగుతుంది.

నారద పరశర ప్రహ్లాద మార్కండేయాది భాగవతులు ద్వంద్వా లలో....శుద్ధ సాత్వికతత్వాన్నీ....వెలుగునూ....అనుసరిస్తే, ఆరాధిస్తే.... హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు, రావణ కుంభకర్ణులు తమోగుణాన్ని.... చీకటిని అంటే ద్వందాలలో రెండవ భాగాన్ని ఆశ్రయించారేమో....!

వాస్తవంగా విలసిల్లే ఈ భిన్నత్వంలోని ఏకత్వాన్ని చూడ గలిగితే అదే నిజమైన లోచూపు.

అందుకే అమ్మ, "రక్తమంతా ఈశ్వర తత్వమే" అంటుంది.

నీ కులమేమిటమ్మా - అని అడిగితే, "శుక్ల శోణితాల కేదో అదే నా కులము" అంటుంది.

18. అనుభవిస్తున్నదే సత్యం

"అమ్మా! ఆశ్రితావనీ! లోకపావనీ! అర్థము తెలియని ఆవేదనతో నేను ఎక్కడకు వెళ్ళుదును? గమనపదమును చూపవా" అని అర్థిస్తున్నది ఒక హృదయం.

"శ్రీశైల మల్లేశ్వరా! పార్థునికి పాశుపతాన్ని అందించావు. మాకు నీ చేయూత నందించవేమి? మా బ్రతుకు పూబాటగా మలచవేమి?" అని ప్రార్థిస్తున్నది వేరొకహృదయం.

"నీ పాదాలచెంత కానప్పుడు నీ పదార్చనకు పనికిరానప్పుడు ఈ జీవనసుమం వాడిపోతేనేం, ఎక్కడ రాలిపోనేం' అని వేదన చెందు తున్నది మరొక హృదయం.

అదేదన, అశాంతి, అభ్యర్థన, ఆర్తనాదాలు అనేక హృదయాల్లో అనేక రూపాల్లో పెల్లుబుకుతున్నాయి.

"కాంత విమోహమలినీకృత దృష్టి దుష్టః
త్వన్మంగళాకృతి విలోకన శాంత చిత్తః
కిం వాభవేత్తవ కృపాంతు ఋతేనసూయే"

అని చేయూత నొసంగి బ్రోవమని ప్రార్థిస్తున్నది ఇంకొక హృదయం.

'బ్రతుకంతా బాధల తోరణాలేనా అని ప్రశ్నిస్తే "బాధల తోరణం కాదు. బాధలతో రణము" అని సమాధానపరుస్తుంది అమ్మ.

దారిద్ర్యంతో కృంగి పోతున్నానంటే 'నాయనా! దారిద్ర్యం కూడా నేనే' అన్నది.

'అమ్మా! నీవు రాజేశ్వరివి' అంటే "నీవుకానిది నేనే మీ కాదు" అన్నది,

అడగనిదే అవసరాన్ని గమనించి పెట్టేదే అమ్మ అని తెలుసు, ధ్యాసే ధ్యానం అని తెలుసు, నమస్కారం అంటే చేతులు కలపటం కాదు అని తెలుసు.

అమ్మ అంటే నాలుగుగోడలమధ్య మంచంమీద కూర్చున్న రూపం మాత్రమే కాదు; ఆద్యంతలు లేనిదీ, అంతా తానైనదీ అని తెలుసు. అమ్మ సర్వజ్ఞ అని తెలుసు అయినా అమ్మతో చర్చించాల్సిన విషయాలు రోజు రోజుకి పెరుగుతూనే ఉన్నాయి.

తర్కించుకునేకొద్దీ సందేహాలు; తరగటం లేదు. పెరుగుతున్నాయి. అనుభవించేకొద్దీ కోరికలు అణగారటం లేదు అభివృద్ధి చెందుతున్నాయి. "దీన్ని తుడిచివేద్దామన్న ప్రయత్నమే దాన్ని అభివృద్ధిచేస్తుంది" అంటుంది అమ్మ.

ఒకరు అమ్మతో ఇలా అన్నారు. "పాపం చేస్తున్నాననే స్ఫురణ ఉంది. పాపానికి ఎడంగా ఉండలేక పోతున్నాననే వేదన ఉన్నది ఎంత వరకు ఈ సంఘర్షణ? ఎంతకాలం ఈ తపన? ఎప్పటికి దీనికో సమాధానం?" అమ్మ అన్నది. "ఒక ఒడ్డు ఎక్కటానికే ఈ ఘర్షణ. నీ మానసిక సంఘర్షణ. దీన్నిగురించి ఆలోచన ఇదివరలో లేదు. ఇప్పుడు వచ్చింది కదా? ఈ ఆలోచనకు ఏశక్తి కారణమో సమయం వచ్చినపుడు ఆశక్తే నివేదనని పోగొడుతుంది." అంతవరకు ఏం చెయాలి అనే ప్రశ్నని పరిశీలిద్దాం. యదార్థానికి 'ఏం చేయాలి' అన్న ప్రశ్నకి సమాధానం వచ్చేలోగా, ఇచ్చేలోగా చేయ్యటం జరుగుతూనే ఉన్నది, గతం గురించి గుర్తులేదు. వర్తమానం గురించి ఆలోచన లేదు. భవిష్యత్ గురించి ఆలోచన, ఆవేదన తప్పటంలేదు. జీవితంలో. మరి 'వనజభవుండు నెన్నొసట వ్రాసినది' అనుకుంటూ చేతులు కట్టుకుని కూర్చొనగలడా? లేడు. మరేం చేయ్యాలి? మళ్ళీ మొదటకే వచ్చాము. ఏం సాధనచేయ్యాలి అని ఒక యజమాని ప్రశ్నిస్తే "నీ సంసార బాధ్యతలే నీకు ఆధ్యాత్మికసాధన" అంటుంది అమ్మ. ఒక ఇల్లాలు అడిగితే, "నీభర్తే నీకు దైవం భర్త అంటే శరీరం కాదు. భావన" అంటుంది.

ఒక ఉపాధ్యాయుడు అడిగితే "నీ పిల్లలే నీకు అన్నం పెడుతున్నారని నువ్వు పాఠాలు చెప్పు, నీకు వేరే సాధన ఎందుకు? నీకు పూజ లెందుకు" అంటుంది.

ఒక వైద్యుడుప్రశ్నిస్తే, "రోగికి వైద్యుడు నారాయణ స్వరూపుడు వైద్యునికి రోగికూడా నారాయణ స్వరూపుడే" అంటుంది

ఒక వ్యాపారి ప్రశ్నిస్తే. "లాభం వచ్చినా నష్టం వచ్చినా ఆశీర్వచనం ఎప్పుడూ ఉన్నది" అంటుంది.

ఆధ్యాత్మిక తీర్థంలో మునిగి తేలుతున్నా మనుకునే శిష్యులు ప్రశ్నిస్తే, గురువు బ్రహ్మ అన్న తర్వాత ఏ గురువుకి మహిమ ఎక్కువ. ఏ మంత్రానికి

శక్తి ఎక్కువ అన్న ప్రసక్తి లేదు. గురువును బ్రహ్మగా అనుకున్న తర్వాత తాను ఏది చెప్పినా నీకు అది మంత్రమే" అంటుంది అమ్మ.

ఒక జిజ్ఞాసువు ప్రశ్నిస్తే, "అన్నీ పేర్లూ వాడివే అన్నీరూపాలూ వాడివే. జయహెూ మాత అంటే వేరు హరేరామ అంటే వేరు కాదు నీకు ఏ నామం ఇష్టమైతే అది చెయ్యి. ఏరూపం ఇష్టమైతే దాన్ని ఆరాధించు" అంటుంది.

ఒక ముముక్షువు ప్రశ్నిస్తే, "బ్రహ్మత్వ సిద్దికని మనం చెయ్యవలసింది ఏమిటి అంటే పుస్తకాలు చదవడం కాదు, సాహిత్యంతో రాహిత్యం కాదు. ఆ సమయం వచ్చినపుడు ఆ శక్తి ఇస్తుంది. అంత వరకూ ఊరికే కూర్చోనా అంటే కూర్చుండలేవు నీ చేత ఆ శక్తి ఏది చేయిస్తే అదే నీకు సాధన. సాధన అన్నది నీ చేతులలో లేదు. ఎంతగా నీవు చేస్తున్నానని అనుకున్నా, నీకు అనిపించినా ఆ శక్తి అనుకోనిదీ, చేయించనిదీ నువ్వు అనుకోలేవు, చేయ్యలేవు" అంటుంది.

వైరాగ్యం గురించి ప్రశ్నిస్తే, "సర్వతా అనురాగమే విరాగము. సన్యాసి కావటం వేరు. సన్యాసం పుచ్చుకోవటం వేరు అంటుంది· 'సంకల్పమే భగవంతుడు' కాగా నా సంకల్పము ఎందుకు ఫలించటం లేదు అంటే." సంకల్పం అంటే ఒక ఆలోచన కలిగినది అని వికల్పం అంటే మారినది అని సంకల్పము వికల్పము... రెండూ ఆశక్తివేనన్న సంకల్పమే సత్సంకల్పం" అని అంటుంది.

వెలుతురునకు ఆధారం చీకటి అయినా, సుఖానికి ఆధారం దుఃఖం అయినా మనస్సు వెలుతురువైపు పరుగుదీస్తుంది. సుఖంకోసం ఎదురు తెన్నులు చూస్తుంది. వర్తమానంతో తృప్తిచెందక ఎప్పుడూ భవిష్యత్‌ను అందంగా ఊహించుకుంటూ జీవితనావను గెంటుకు పోతుంది.

తృప్తి మనిషి అభివృద్ధికి నిరోధక మంటారు. కొందరు. కాని ఆశ మనిషి అశాంతికి మూలం. సంతోషం సగంబలం. ఉత్సాహంతో ఉన్నప్పుడే పెరుగుదలకి అవకాశం. దానికి మానసిక శాంతీ, వికాసం అవసరం. లేదు

లేదు అనో కావాలి కావాలి అనో అనుకుంటూ పోతే లేనిది రాదు. ఉన్నది పోదు. 'అందరికి సుగతే' అని హామీ ఇచ్చినా ఒకరకమైన పూజలో, నామమో.... సాధనో చేయలేక పోయామనే వేదన మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. అడగనిదే అవసరాన్ని గమనించి పెట్టేదే అమ్మ తత్వం అయినపుడు 'దేహిమే శరణం అంబ' అని అర్థించటం దేనికోసం?

"నేను నీవెన్నంటి ఉన్నాను నాన్నా" అని అమ్మ అంటూంటే 'నా పిలుపే వినలేవా, నా వేదన కనలేవా' అనే ఆర్తనాదాలతో అమ్మ హృదయాన్ని ప్రతిధ్వనింప చేయటం దేనికోసం?

"అభయహస్తంతో నీ ఫోటో కావాలమ్మా; అని అడిగితే "అభయం నీ మనస్సుకు అనిపించాలి. అభయం ఫోటో కాదు కదా! దాన్ని నీ మనస్సు గుర్తించాలి" అంటుంది అమ్మ మనుషులూ.... మనస్సులూ.... పరిస్థితులు.... పరిసరాలూ వేరు. ఎన్ని తెలిసినా, ఎన్ని విన్నా, ఎన్నింటిని మననం చేసుకున్నా అనుభవిస్తున్నదే సత్యం. అనుభవదూరమైతే సత్యాన్నైనా మనస్సు అంగీకరించదు. జీర్ణం చేసికోలేదు. అన్నీ వాడే చేస్తున్నాడని తెలుసున్నా అనుభవంలోకి వచ్చేసరికి, 'అమ్మ నన్ను పరీక్షిస్తోందా?

నా వేధనని ఎందుకు ఆలకించదు?

నా వ్యధని ఎందుకు ఆర్పివేయదు?

విధి నిర్ణయం జరిగి తీరవలసిందేనా?' అని మనస్సు పరి పరి విధాల తలపోస్తుంది. జీవితమే ఒక నాటకం అన్నా వినదు. ఎంతగా సరిపెట్టుకుందామనుకున్నా సరిపడదు. ఎంతగా సముదాయించుకున్నా సమాధాన పడదు. కన్నీరు సాగర సదృశమై, ఉత్తుంగ తరంగితమై, హృదయపు కట్టలను త్రెంచుకొని.

ఎవరికోసమూ ఆగక....

ఎవరితోనూ చేరక....

ఎక్కడకో....ఎందులకో....

ఒంటరిగా....వడివడిగా

ఉరకలు వేస్తుంది; పరుగులు దీస్తుంది.

వాస్తవం ఎమిటి అంటే ఏ ప్రశ్నకైనా సమాధానం మాటలు గాదు. మాటలుగా మాత్రం కాదు. అనుభవమే. అందుకే అమ్మ.

"నీమనస్సుకు తోచినట్టు చెయ్యి.

తోపింపచేసేది వాడేగా" అంటుంది.

అందరి అభిమతాన్ని అంగీకరిస్తుంది.

అన్ని మతాల్ని ఆదరిస్తుంది.

అందరి హృదయాల్లో జ్యోతిని వెలిగిస్తుంది.

అందరి హృదయాల్లో జ్యోతియై వెలుగుతుంది.

సజ్జనుడిని, దుర్జనుడిని సమంగా ప్రేమిస్తుంది.

"కనుపించేదంతా ఆశక్తి అయితే కన్నులు మూసుకోవటం ఎందుకు?" అని ప్రశ్నిస్తుంది.

"పిపీలిక బ్రహ్మకాక పోతేగా" అని సమాధానపరుస్తుంది.

అన్ని పద్ధతులూ తనకు నచ్చుతా యంటుంది.

ఏ పద్ధతికి తాను నొచ్చుకోనంటుంది.

19. అమ్మ సందేశము -

Duty is God; work his worship - అని కొందరు బోధిస్తే, అణాలు కాదు కావల్సింది గుణాలు అని కొందరు బోధిస్తున్నారు.

కోరికల్ని విడిచి పుచ్చమని కొందరు ప్రవచిస్తే కామినీకాంచనాల్ని వర్జించమని కొందరు ఉబోధిస్తున్నారు.

'సాధనమునకు పనులు సమకూరు ధరలోన' అని కొందరు పురుష కారం గురించి నొక్కి వక్కాణిస్తే "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని మరి ఒకరు ప్రవచిస్తున్నారు.

సందేశము అన్నది సామూహికంగా, జనబాహుళ్యానికి ఆదర-ప్రాయంగా; జీవిత ఉన్నత విలువల్ని పొందేందుకు మార్గదర్శకంగా, మానవ నడవడికను తీర్చిదిద్దే దిక్సూచిలా ఒక ఆచార్యులు అందించే సలహా అని చెప్పొచ్చు.

మతపరమైన ఆచార్యులేకాక సంఘసంస్కర్తలు, జాతిపితలు, మన నేతలుకూడా మనకు అందించే సలహాలను, నిజాలను కూడా సందేశాలుగా పరిగణిస్తాము.

ఏదైనా సందేశం చెప్పమని అమ్మను కోరితే, "ఏదీ చెప్పను. నాన్నా! ఏదీ చెప్పకపోవటమే నా సందేశము" అంటుంది.

తత్వపరంగా అయినట్లయితే అవాఙ్మానసగోచరమైన అక్షర పర బ్రహ్మ తత్వాన్ని అక్షరాలలో చెప్పటం అసాధ్యం అని తెలుస్తుంది.

మనుష్యులు వేరు. వారి దృక్పథాలు వేరు, పరిసరాలు వేరు, వారివారి మానసిక వ్యవస్థలు వేరు. కాబట్టి సామూహికంగా కాకుండా అమ్మ ఇచ్చే సలహా ఒక్కొక్కసారి వ్యక్తిగతంగా సందేశం అవుతుంది.

కన్నీటిలో ఈదులాడుతూ కాలప్రవాహంలో కొట్టుకుపోయే ఒక నిర్భాగ్యుడు, 'బ్రతుకంతా బాధలతోరణాలేనా?' అని ప్రశ్నిస్తే-

"బాధలతోరణం కాదు; బాధలతో రణం" అని చెప్పింది. ఆశ్శ అసంతృప్తుల కలయికే జీవితం అని ఓదార్చింది.

'బాధలేని జీవితంకంటె చావు నయం' అనీ ధైర్యం చెప్పింది.

సీత, సావిత్రి' హరిశ్చంద్రుడు - వారి కథల నుండి మనం తెలుసుకునే దేమిటీ? వారు పడిన కష్టాలతో పోలిస్తే మనం పడే బాధలెన్ని? కష్టాలు వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలి - అని సమాధాన పరుస్తుంది.

'అన్ని బాధలకంటె ఆకలిబాధ గొప్పది' అంటూ,

"ఆకలితో జిల్లెళ్ళమూడి రావచ్చుగాని,

ఆకలితో జిల్లెళ్ళమూడి విడిచి వెళ్ళకూడదు" అంటుంది. కన్నతల్లి కనుక అందరి కడుపుల్ని తడువుతూ, (Sympathetic Vibration towards the suffering is Divinity) బాధితులయెడ కలిగే కరుణారసభరిత హృదయస్పందనమే దైవత్వము అని వివరిస్తుంది.

అమ్మచేతిమీదుగా ప్రారంభిస్తే లాభాలు వస్తాయని అమ్మను అడిగిన వ్యాపారితో 'లాభాలు కలిగినా, నష్టాలు కలిగినా అన్నీ అనుగ్రహం వల్లనే, అంటుంది.

ఆపదల్ని కలిగించేవాడూ, ఆపదలనుంచి రక్షించేవాడూ ఒక్కడే-అని చెబుతూ విశ్వాసమే భగవంతుడు అని నిర్వచిస్తుంది.

ఏం చెయ్యమంటావు అని ఒక అన్నయ్య అమ్మను ప్రశ్నిస్తే "నీ సంసార బాధ్యతలే నీకు ఆధ్యాత్మిక సాధన" అంటుంది.

ఒక ఇల్లాలుతో "నీ భర్తే నీకు దైవం" అంటుంది. ఒక ఉపాధ్యాయునితో "నీ పిల్లలే నీకు అన్నం పెడుతున్నారని నువ్వు పాఠాలు చెప్పు. నీకు వేరే సాధన ఎందుకు! నీకు పూజ లెందుకు?" అంటుంది. ఒక వైద్యునితో "రోగికి వైద్యుడు నారాయణ స్వరూపుడు. వైద్యునికి రోగికికూడా నారాయణ స్వరూపుడే" అంటురెది.

ఆధ్యాత్మిక తీర్థంలో మునిగి తేలుతున్నామనుకునే శిష్యులతో గురువు బ్రహ్మ అన్న తర్వాత ఏగురువుకి మహిమ ఎక్కువ, ఎ మంత్రానికి ఎక్కువ అన్న ప్రసక్తి లేదు. గురువును బ్రహ్మగా అనుకున్న తర్వాత తాను ఏది చెప్పినా అది నీకు మంత్రమే" అంటుంది. ఒక జిజ్ఞాసువు ప్రశ్నిస్తే "అన్ని

పేర్లూ వాడివే అన్ని రూపాలూ వాడివే. జయహెూమాత అంటే వేరు హరేరామ అంటే వేరు కాదు. నీకు ఏ నామం ఇష్టమైతే అది చెయ్యి ఏరూపం ఇష్టమైతే దాన్ని ఆరాధించు" అంటుంది.

సాధన గురించి వివరిస్తూ "సాధన అని అంటున్నది వాస్తవానికి లేదు, చేయ్యగలిగిన అవకాశాన్ని గుర్తించటమే సాధన అన్నది. నీకు ఏది సాధ్యమైనదో అది సాధన. ఇతరులు చెప్పినదీ కాదు. నువ్వు చేస్తామనుకున్నదీ కాదు. మరి నీచేత ఆ శక్తి చేయించినదే సాధన" అంటుంది. ఒక ముముక్షువుతో "బ్రహ్మత్వ సిద్ధికని మనం చెయ్యవలసింది ఏమిటే అంటే పుస్తకాలు చదవడం కాదు. సాహిత్యంతో రాహిత్యం గాదు. ఏ శక్తి నీకు చేయవలసిన దేమిటి? అన్న ప్రశ్న కలిగించిందో అదే తరుణం వచ్చినపుడు నీ చేత చేయిస్తుంది. 'నేను' అని ప్రత్యేకంగా అనుకునే 'నీ' చేత ఆ శక్తి అనుకోనిదీ చేయించనిదీ, నువ్వు అనుకోలేవు, చెయ్యలేవు" అంటుంది.

కనుకనే "నీకు తోచింది చెయ్యి.

తోపింపచేసేసిది వాడే (ఆ శక్తి కదా?)" అంటుంది.

మరొకరకంగా 'చేతలు చేతుల్లో లేవు' అని స్పష్టంచేస్తుంది.

అందుకే ప్రేరణను గురించి "ప్రేరణను మీరు ఏద్దైనా అనండి-ప్రారబ్దం అని కాని భగవంతుడని కానీ మరేదైనా సరే, లేకపోతే వీటన్నిటికీ కారణం మనమే అనండి. అంతా నేనే చేస్తున్నానని కానీ - లేదా అంతా మనది కాదు. ఏదో శక్తి చేయిస్తున్నది అనీ కానీ అనుకోండి. కానీ కొంతసేపు నేను, కొంతసేపు ఏదో శక్తి చేయిస్తుంది అనుకోవటం చిక్కే-" అంటుంది.

మన చేతులు, కాళ్ళు కదులుతున్నాయి కనుక మనం చేస్తున్నాం అనుకుంటున్నాం. కనుకనే 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అని అనదిగా విశ్వసిస్తున్నాం.

కాని అదృశ్యంగా ఉన్న శక్తి ప్రేరణ మనకు అర్థం కాదు. అగుపడదు; అనిపించదు.

"అనుకున్నది జరగదు; తనకున్నది తప్పదు" అనే అమ్మ సూక్తి అడుగడుగునా యదార్థం అని తెలుసున్నా పురుషకారం వైపు మనస్సు మొగ్గుతూంటుంది. అట్టి ఒక సోదరుడు ఆ భగవంతుని అనుగ్రహం కోసమైనా మేము ప్రార్థన చెయ్యాలి కదమ్మా అని అంటే "మీ చేత ఆ ప్రార్థన చేయించుకోవాల్సింది కూడా తనే" అన్నది.

చేయించడం కాదు చేయించుకోవడం అనే అమ్మ మాటలు యదార్థాన్ని మరింత నొక్కి ప్రస్ఫుటం చేస్తున్నాయి.

అమ్మ రాగమయి. ప్రేమైకమూర్తి.

అమ్మ సిద్ధాంతం 'ప్రేమ-రాగం' పైన ఆధారపడి ఉన్నది.

కోరికలను చంపుకోమని, మమకారం త్రెంచుకోమని రాగాన్ని వర్జించమని అనేక ప్రవక్తలు చెపుతోంటే అమ్మ ప్రేమను పెంచమని చెపుతుంది.

మమకారం అవరోధం కాదని విస్తృతం చెయ్యమనీ అంటుంది.

'పరిమితమైన మమకారం మానవత్వాన్ని'

'విస్తృతమైన మమకారం మానవత్వాన్ని' గుర్తింప చేస్తుంది అంటుంది.

కాబట్టి అమ్మ సందేశంకూడా రాగబంధురమే. ఒకసారి బెంగుళూరు విమానాశ్రయంలో పనిచేసే సోదరీ సోదరులు అమ్మను చూసేందుకు వచ్చారు. విశ్వజననీ దివ్యదర్శనానంద వివశులై ఆ ప్రేమామృత ధారలలో తడిసి, తన్మయులై తనుయులై 'ఏదైనా సందేశం ఇవ్వమ్మా' అని అడిగారు. వెంటనే అమ్మ, "వేరే సందేశం ఏమున్నది నాన్నా! ఎవరైనా ఆపదలో ఉంటే ఆదుకోవాలి, ఎక్కడ ఉంటున్నా, ఎక్కడ ఉద్యోగం చేస్తున్నా అందరూ ఒకే తల్లి పిల్లలు అనే భావంతో ఉండండి" - అని తన మాతృతత్వాన్ని వెల్లడించింది.

ఇక్కడ 'వేరే సందేశం ఏమున్నది' అని అమ్మ అనటం మనకు వివేషం.

'కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా నభవతి' అని శంకరాచార్యుల వారు చెప్పినట్లు అమ్మ మనల్నందరిని తన బిడ్డలుగా సర్వాత్మనా సంభావన చేస్తున్నది. కానీ మనం.........కి మనం అమ్మను చూస్తాం. కానీ అమ్మ మనల్ని చూసుకుంటుంది.

మనం అమ్మకు పూలు, పండ్లు యిస్తాం. కానీ అమ్మ మనకు అన్నం పెట్టుకుంటుంది.

కనుకనే మీకు పెట్టుకుంటే నాకు ఆనందం అంటుంది ఒక్క మాటలో చెప్పాలంటే మనకు స్వార్థమే పరమార్థం; అమ్మకు పరమార్థమే స్వార్థం.

'యద్యత్కర్మకరోమి తత్తదఖిలం శంభో తవారాధనం' అని మనం అనకుండానే అమ్మ మనం చేసే ప్రతీపనీ దైవసేవక్రిందే లెక్క వేస్తోంది.

కనుకనే తన సేవలూ, తన సంపదా అమ్మ సంస్థకు వినియోగ పడటంలేదు అనే ఒక సోదరునితో అమ్మ "ఈ సృష్టిలో నీ సేవలూ, నీ సంపదా ఎవరికీ చెందకుండా ఏ మౌతాయి? అవి ఎవరికి చెందినా దైవానికీ చెందినట్లే. నువ్వేమీ బాధపడకు నాన్నా" అని అన్నది. "నీకున్నది తృప్తిగా అనుభవించి, నలుగురికి ఆదరణగా పెట్టటం, అన్నీవాడే చేయి స్తున్నాడని నమ్మటం" ఇదే నా సందేశం అని అమ్మ పలుమార్లు చెప్పింది.

మరొకరకంగా ఎదుటి వానిలో మంచిని చూస్తున్నంత సేపూ నీలో దైవత్వం కలుగుతుంది అని పరామార్థాన్ని ప్రకటిస్తుంది. మన పరిమితరాగ పరిధిని విస్తృతం చేసి, ఎదుటి వారిలో మంచినీ చూసేందుకు ప్రయత్నిస్తూ, మన ఇరుగు పొరుగువారిని సోదరీ సోదరులుగా తెలుసుకుని, మనమంతా ఒకే తల్లి పిల్లలం అనే భావనతో మనకున్నది నలుగురికీ ఆదరణగా పెట్టుకుంటూ, అంతా ఆ శక్తి చేయిస్తున్నదే అని విశ్వసిద్దాం. అమ్మ సందేశాన్ని ఆచరణలో పెట్టుకుని. మీరు ఎవరి పిల్లలు అని అడిగితే........

మాతాచ పార్వతీదేవి,
పితాదేవో మహేశ్వరః
మా తల్లి పార్వతీదేవి
మా తండ్రి ఈశ్వరుడు-అని గర్వంగా
చెప్పుకోగలిగే స్థాయికి ఎదుగుదాం.